# జనశక్తి

విప్లవ కమ్యూనిస్టుల పక్ష పత్రిక

www.janashaktionline.com

సంపుటి : 43 సంచిక : 24 విజయవాడ 20-4-2011 పేజీలు : 8 వెల: రు 5.00

లోపలి పేజీల్లో...

◈ 1972లో విశాఖ జైలునుండి ఆరుగురు సిపిఐ (ఎం-ఎల్) నాయకులు విప్లవ శ్రేణులకు వ్రాసిన బహిరంగలేఖ

◈ లిబియాపై సామ్రాజ్యవాద దురాక్రమణ

◈ పెన్షన్‌బిల్లు-పాలక పార్టీల నిజస్వభావం

◈ ఎర్రగడ్డ మానసిక వైద్యశాలపై ఎన్.హెచ్.ఆర్.సి. పరిశోధనలో వెలుగు చూసిన ఆర్థిక, సామాజిక కోణాలు

## అవినీతిపై "యుద్ధం"

**జనలోక్‌పాల్** బిల్లు కావాలంటూ అన్నాహజారే నిరాహార దీక్ష-దానిచుట్టూ చేరిన పౌర సమాజమని చెప్పుకునే ఎన్‌జివోల ప్రచారం - కాంగ్రేసు ప్రభుత్వాన్ని యిరుకున పెట్టాలని అన్నా హజారేకు మద్దతు పలికిన ప్రతిపక్షాల ఉత్సాహం- బిల్లును రూపొందించేందుకు కమిటీ ఏర్పాటుకు ప్రభుత్వ అంగీకారం-విజయోత్సాహంతో దీక్ష విరమణ-నాటకీయ పరిణామాలుగానే సాగాయి.

కమిటీ రూపొందించే బిల్లు ఎలా వుంటుదో చెప్పలేమనీ ఇది ప్రయోగం మాత్రమేనని కాంగ్రేసూ-రాజకీయ పక్షాలపై బురదజల్లడం ప్రజాస్వామ్యానికే చేటని బిజెపీ-అవినీతి వ్యవస్థీకృతంగా లేదనీ, వ్యక్తులు మాత్రమే అవినీతి పరులనీ, వారిని తొలగిస్తే నేటి వ్యవస్థ దేశాన్ని పురోగమనం వైపు నడిపిస్తుందన్న 'పౌర సమాజపు' ఈ సన్నాయి నొక్కులూ-కూడా నాటకీయంగానే సాగుతున్నాయి.

ప్రభుత్వ కార్యాలయాల్లో ఉద్యోగులు లంచాలు తీసుకోవటాన్నే అవినీతిగా చూసిన, ప్రైవేటు రంగం అవినీతికి అతీతంగా వుందనుకున్న రోజుల్లో కూడా వ్యవస్థీకృత అవినీతి ఆర్థిక వ్యవస్థనూ, ప్రజాజీవనాన్ని కృంగదీసింది. ప్రభుత్వరంగ పరిశ్రమలను కొల్లగొట్టుకుని ప్రైవేటు రంగం లాభపడితే, దానికి తోడ్పడిన అధికార నేతల గణాలు సొమ్ము మూటకట్టుకున్నాయి. ప్రభుత్వరంగ పరిశ్రమల నష్టాలను ప్రజాధనంతో పూడ్చి ప్రజలపై భారం మోపారు. ప్రభుత్వ కాంట్రాక్టులలో పంచాయితీ నుండీ కేంద్రం వరకూ ప్రభుత్వ, ప్రైవేటు రంగాలు చేతులు కలిపి నడుస్తున్నాయి. ప్రజాధనాన్ని కొల్లగొట్టి సేకరించుకున్న నిరంకుశాధికార పెట్టుబడితోనే భారతబడా బూర్జువావర్గం పెరిగింది. లైసెన్సు రాజ్యంతో రాజకీయనేతలు కోట్లకు పడగలెత్తారు. అత్యంత అవినీతిమయ దేశంగా ఏడాదికొకసారి భారత నొసటన బొట్టు పెట్టే సామ్రాజ్యవాద సంస్థల గురివింద తంతును-భోఫోర్సు ఫిరంగుల కొనుగోలులో అవినీతి బట్టబయలు చేసింది.

లైసెన్సు రాజ్యమే అవినీతికి కారణమంటూ చేపట్టిన సరళీకరణ, ప్రైవేటీకరణ విధానాల అమలు ప్రారంభంలోనే హర్షద్ మెహతా కుంభకోణం ప్రజాధనంతో జూదమాడి నేతలు మూటలు కట్టుకున్న తీరుని తెలిపిందే. ఇన్నాళ్లూ ప్రభుత్వ బడ్జెట్టును కొల్లగొట్టి ప్రజలపై పరోక్షంగా భారం మోపిన అవినీతి, నూతన ఆర్థిక విధానాలతో మరింతగా ఊడలు దింపి విస్తరిస్తోంది.

సామ్రాజ్యవాదుల నిర్దేశాలతో చేపట్టిన సరళీకరణ, ప్రైవేటీకరణ పేరిట సహజవనరులనూ, ప్రజల ఆస్తులనూ, (ఖనిజాలు, చమురు, గ్యాసు, భూమి, అడవి, నీరు, స్పెక్ట్రం తదితరాలను) స్వదేశీ, విదేశీ బడాబూర్జువాలకు కట్టబెట్టారు. రాత్రికి రాత్రే వందలాది అవగాహనా పత్రాలపై సంతకాలు చేసి సెజ్‌లు, విమానాశ్రయాలు, రోడ్లు, పరిశ్రమల పేరిట లక్షలాది ఎకరాలను ధారాదత్తం చేశారు. విలువలో ఒక శాతం రాయల్టీ కూడా పొందకుండానే లక్షల కోట్ల రూ॥ విలువచేసే ఖనిజాలను పందేరం చేశారు. వీటిని ఎగుమతులు చేసి లాభాలు గడించారే తప్ప దేశంలో వీటినుండి ఉత్పత్తులు చేసే పరిశ్రమలు పెట్టలేదు. దేశపు బొగ్గుగనుల్లో 70 శాతం పైగా విదేశీ పెట్టుబడుల పరం చేసి, విద్యుత్తు కర్మాగారాలకు విదేశీ బొగ్గును దిగుమతి చేసుకోమంటున్నారు. ఇది సహజ ఆర్థిక వనరులన్నింటినీ స్వదేశీ, విదేశీ బడా బూర్జువాల పరం చేస్తోంది. రోడ్డు మీదకు వెళితే టోలు పన్ను, చివరకు త్రాగునీరు కూడా కొనుక్కునే స్థితిని కల్పించారు. కాగా భూమి, అడవి, నీటి వనరుల ప్రైవేటీకరణ లక్షలాది పేద ప్రజలను నిర్వాసితులను చేసింది. వారి జీవనాధారాన్ని విధ్వంసానికి గురిచేసింది.

ఫలితంగానే నూతన ఆర్థిక విధానాల అమలు తర్వాత దాదాపు 60 లక్షల కోట్ల రూపాయల అక్రమార్జనలు దేశం నుండి విదేశాలకు తరలి వెళ్లాయి. ఈ అవినీతి కార్యకలాపాలు వటుడింతై అన్నట్లు పెరిగి నేడు మొత్తం రాజ్యవ్యవస్థనే తన అదుపులో పెట్టుకునే స్థాయికి చేరాయి. రాజశేఖరరెడ్డి తనయుడు జగన్‌కూ కాంగ్రేసు అధిష్టానానికీ మధ్య సాగుతున్న తగవు ఇదే. గాలి సోదరుల అక్రమార్జనలు బయటపడ్డా వారినే అంటకాగిన బిజెపి తత్వమూయిదే.

అయినా అవినీతిపై "పవిత్రయుద్ధం"ను ప్రకటించటంలో వీరెవ్వరూ తీసిపోరు. అవినీతి నిరోధక శాఖలను ఏర్పాటు చేసి క్షాళన చేస్తామంటారు. దొరికిన అవినీతి పరులను విచారించి శిక్షించే అధికారాన్నివ్వరు. నల్లధనాన్ని వెలికి తీస్తామంటారు. స్వచ్ఛందంగా వెల్లడి చేసే పథకాలతో నల్లధనానికి తెల్లధనమన్న చట్టభద్రత కల్పిస్తారు. విదేశీ బ్యాంకుల్లో నిధులు వెనక్కు తీసుకొస్తామంటారు. ఒక్క పైసా తేవటానికి కూడా అంతర్జాతీయ ఒప్పందాలు లేవంటారు.

ప్రజలలో నిరసన వెల్లువెత్తినప్పుడు లోకాయుక్త వంటి వాటిని ఏరాటు చేస్తారు. అవియిచ్చే వేదికలను బుట్టదాఖలు చేస్తారు. సెంట్రల్ విజిలెన్సు కమిటీలో తమ కనుసన్నల్లో మెలిగే వారినే నియమించుకుంటారు. ప్రజాఉద్యమాల వత్తిడితో ప్రజాసంక్షేమం పేరిట తెచ్చిన చట్టాలన్నీ ఇలాంటివే. చట్టాలు చేస్తారు. కానీ వాటినమలు జరిపే యంత్రాంగాన్ని ఏర్పాటు చెయ్యరు. కార్మిక చట్టాలను తమకళ్లముందే కాలరాస్తున్నా చూడనట్లే ఊరకుంటారు.

కమిటీ నిజాయితీతో పనిచేసి నిజంగానే ఒక బిల్లును రూపొందించినా జరిగేదిదే. బిల్లు తుది రూపం రాకుండానే ఎలాంటి జవాబుదారీతనం లేకుండా సర్వాధికారాలున్న వ్యవస్థ ఏర్పాటు ప్రమాదకరమన్న, దానిలో నియమించబడే వారి నిజాయితీకి గీటురాళ్లేమిటన్న, ప్రజాస్వామికంగా రూపొందిన పార్లమెంటు వంటి సంస్థలను ప్రక్కనబెట్టటం ప్రజాస్వామ్యానికే ప్రమాదమన్న విమర్శలు, హజారే దీక్ష అవినీతి అంతానికి ప్రారంభమని కీర్తించిన వారే చేయటం మరో కోరలు లేని కంటి నీటి తుడుపుబిల్లు రాబోతుందనీ సూచిస్తున్నాయి.

ప్రజాజీవనాన్ని ఛిన్నాభిన్నంచేస్తున్న అవినీతిపై పోరాడేందుకు సంసిద్ధపడకుండా మధ్యతరగతి భద్రజీవులు రాజకీయాలను ఏవగించుకుంటూ ఆత్మవంచన చేసుకుంటున్నారు. ప్రజాసంక్షేమాన్ని, దేశ ప్రయోజనాలనూ కాపాడే రాజకీయాలను అనుసరించేబదులు రాజకీయాలు మనకెందుకన్న ధోరణికి లోనవుతున్నారు. అవినీతి తొలిగితే వ్యవస్థ మంచిదేనన్న ఆలోచనలో వుంటున్నారు.

మధ్యతరగతి ప్రజల నుండి రాజకీయంగా వేరు పడిపోతున్న పాలకవర్గాలూ, వారి ప్రాతినిధ్య పార్టీలూ తమ దోపిడీ పాలనకు వీరి ఆమోదముద్ర కోసం, సాగించిన సంతసందడి యిది. బడిపిల్లలతో కొవ్వొత్తులు వెలిగించి, హజారే దీక్షకు మద్దతు ప్రకటనలు చేయించి,జనలోక్‌పాల్ బిల్లుతో అవినీతి అంతమౌతుందన్న భ్రమలు కల్పించి, తమ దోపిడీ పాలనను నల్లేరుపై బండిలా సాగించుకునేందుకు సాగించిన తంతు యిది. వ్యవస్థలో అంతర్భాగంగా సాగుతున్న అవినీతి, అక్రమార్జనలను రూపుమాపేందుకు వ్యవస్థను మార్చుకోవాలన్న వైపు ప్రజల దృష్టి వెళ్లకుండా ఆడిన నాటకమిది.

పేదప్రజల భూములు దోపిడీ వర్గాలకు కట్టబెట్టి వారి జీవనాన్ని విధ్వంసం చేస్తున్న విధానాలను ఈ బిల్లు ఆపలేదు. దేశ సహజ, ఆర్థికవనరులన్నింటినీ సామ్రాజ్యవాదులకు ధారాదత్తం చేసి దేశ ప్రజలను నికృష్ట దారిద్ర్యానికి గురిచేసి బొజ్జలు నింపుకుంటున్న నేతల చర్యలనిది అరికట్టలేదు. వ్యవస్థలో మార్పు కొరకు ఉద్యమించితేనే తప్ప జనజీవితాన్ని విధ్వంసానికి గురిచేస్తున్న అవినీతి, అక్రమార్జనలు అంతంకావు, అంతవరకూ ఈ టీ కప్పులో తుఫాను వస్తూపోతూనే వుంటుంది. అవినీతిని తుడిచిపెట్టే సునామీలుగా సాగవు. ◈

సంపాదకీయం

## విద్యుత్తు ఛార్జీల పెంపుదలను ప్రతిఘటించండి!

**ట్రాన్స్కో** మళ్లీ విద్యుత్తు ఛార్జీలను పెంచింది. రూ॥ 682 కోట్ల మేరకు వినియోగదారులపై భారం మోపింది. 300 యూనిట్ల కంటే ఎక్కువ విద్యుత్తును వాడిన గృహ వినియోగదారులకే ఛార్జీలను పెంచినట్లు చెప్పుకున్నది. కానీ 200 యూనిట్ల వినియోగం మించిన వారిపై కూడా ఛార్జీలు పెంచింది. దీనిని సబ్సిడీగా పరిగణించి ప్రభుత్వం చెల్లించేందుకు అంగీకరించింది. అయితే ప్రభుత్వం సబ్సిడీని రద్దుచేసి భారాన్ని వినియోగదారులపైనే వేయవచ్చు.

అదికాక, ఇంధన ధరలలో అంతర్జాతీయ మార్కెట్టులో వచ్చిన తేడా సర్దుబాటు పేరిట ఇంధన ఛార్జీలను వినియోగదారులందరికీ పెంచింది. దీనితో 2000 కోట్ల లోటును ట్రాన్స్కో పూరించుకుని వినియోగదారులు వాడుకొనని విద్యుత్తుకు కూడా ఛార్జీలు వసూలు చేసినట్లయింది.

ఇదికాక విద్యుదుత్పత్తి కంపెనీలు వ్యయం పెరిగింది కనుక తమకు చెల్లించే ఛార్జీలను పెంచమని విద్యుత్తు రెగ్యులేటరీ అథారిటీని కోరాయి. ఇప్పటికే ఒక కంపెనీ పెరిగిన రు.1500 కోట్లు చెల్లించమని రెగ్యులేటరీ అథారిటీని కోరింది. దీనిని పరిశీలించడానికి అంగీకరించటం ద్వారా రెగ్యులేటరీ అథారిటీ పెరిగిన వ్యయాన్ని చెల్లించటాన్ని సూత్రప్రాయంగా అంగీకరించింది. దీనితో మిగిలిన విద్యుత్తు కంపెనీలు కూడా వ్యయం పెరిగిందంటూ రెగ్యులేటరీ అథారిటీ ముందుకు వస్తాయి. ఇది రూ॥6వేల కోట్ల వరకూ ఉంటుందని అంచనా. ఈ భారం తిరిగి వినియోగదారులపైనే మోపేందుకు సిద్ధమౌతారు.

ఇదికాక డిస్కోమ్‌ల ప్రైవేటీకరణకూ, అలాగే విద్యుత్తు సబ్‌స్టేషన్ల ప్రైవేటీకరణకూ చర్యలు తీసుకుంటున్నారు.

విద్యుత్తు కొరతను తీర్చేందుకూ, నాణ్యమైన కరెంటును 24 గంటలూ సరఫరా చేసేందుకూ విద్యుత్తు సంస్కరణలను ప్రవేశపెడుతున్నామంటూ విద్యుత్తు బోర్డును ముక్కలు చేశారు. విద్యుదుత్పాదన రంగంలోకి ప్రైవేటు పెట్టుబడిని ఆహ్వానించారు. విద్యుత్తు కొనుగోలు ఒప్పందాల పేరిట వారికి అధిక రేట్లు చెల్లించారు.

విద్యుదుత్పాదనకు సహజవాయువు సరఫరాకు హామీ లేకుండానే కర్మాగారాలు నిర్మించుకునేందుకు అనుమతించి, గ్యాసు కొరతతోఅవి విద్యుత్తు ఉత్పత్తిచేయకపోయినా, ఒప్పందం ప్రకారం వాటికి చెల్లింపులు చేశారు. రిలయన్సు నుండి కేజి గ్యాసును వీటికి ఇప్పించేందుకు, రిలయన్సు గ్యాసు సరఫరాచేస్తున్న కంపెనీలకు దిగుమతిచేసుకున్న గ్యాసును సరఫరా చేసి, రెంటిమధ్య ధరలో వున్న తేడాను భరించేందుకు సిద్ధమౌతున్నారు. ఇదంతా ఇంధన రేట్ల సర్దుబాటు పేరుతో వినియోగదారులపై మోపుతారు.

ఇన్ని భారాలు మోపినా గ్రామాలకు నేటకీ రోజుకు ఏడుగంటలు కూడా విద్యుత్తు సరఫరా జరగటంలేదు. పట్టణ ప్రాంతాల్లో ప్రకటితంగానూ, అప్రకటితంగానూ గంటలపాటు కోత విధిస్తున్నారు. ఇక పరిశ్రమలకూ కోత విధించారు. ఛార్జీల పెంపుతోపాటు వారానికి ఐదురోజులే ఫ్యాక్టరీలు నడపమని చెబుతున్నారు. పైగా ప్రైవేటు విద్యుత్తు కర్మాగారాల కొరకు పంట భూములను రైతాంగంనుండి లాగివేసుకుని వారికి జీవనాధారం లేకుండా చేస్తున్నారు. ఈ అన్యాయమేమిటని ప్రశ్నించినందుకు పోలీసు తూటాలతో ప్రాణాలు బలిగొంటున్నారు. విచక్షణా రహితంగా విద్యుత్తు కర్మాగారాలకు అనుమతులిచ్చి, భూములు గుంజుకోవటమేగాక పర్యావరణ వినాశనానికి పూనుకుంటున్నారు. ఒక్క నెల్లూరు తీరంలోనే 24 విద్యుత్తు కర్మాగారాలకు అనుమతినిచ్చి బూడిద కుప్పగా మార్చేందుకు వెనుదీయటంలేదు. ఇవన్నీ వాణిజ్య విద్యుత్తు కర్మాగారాలే. ఇవేవి రాష్ట్రానికి విద్యుత్తును సరఫరా చెయ్యవు.

విద్యుత్తు రంగ ప్రైవేటీకరణ సాధించిందిది! విద్యుత్తు రంగాన్ని విదేశీ, స్వదేశీ బడా బూర్జువాలకు లాభాల పంట పండించే వనరుగా చేశారు. పేద ప్రజలను, వారి భూముల నుండి తరిమి వేశారు. పర్యావరణాన్ని క్షీణింపచేసి, వారికి జీవనాధారాలను లేకుండా చేశారు. అయినా అన్నిరకాల వినియోగదారులకూ విద్యుత్తు కొరత తీరలేదు. మిగిలింది మాత్రం తద్దినాలు పెట్టినట్లు కంపెనీలు యిచ్చే లెక్కలు చూసి వినియోగదారులకు ప్రతిసారీ రేట్లు పెంచటం మాత్రం అమలవుతున్నది.

విద్యుత్తు రేట్ల పెంపుదలకూ, విద్యుత్తురంగ ప్రైవేటీకరణకూ వ్యతిరేకంగా సంఘటితంగా పోరాటాలకు సిద్ధంకావాలి, ప్రతిఘటించాలి! ◈

# బహిరంగ లేఖ

*పార్వతీపురం కుట్రకేసులో నిందితులుగా విశాఖపట్నం కేంద్ర కారాగారంలో నిర్బంధించబడిన సిపిఐ(ఎం-ఎల్) నాయకులు ఆరుగురు జైలునుండి విప్లవశ్రేణులకు వ్రాసిన బహిరంగలేఖ ఇది. 1972 సం॥ మధ్యకాలంలో కా॥ చారు మజుందార్ అరెస్టుకు, పోలీసుస్టేషన్‌లో ఆయన మరణానికి కొద్దిముందుగా ఇది రాయబడింది. -సంపాదకుడు*

**కామ్రేడ్స్,**

మీ అందరికీ విప్లవాభినందనలు తెలుపుతున్నాము. ఈ సూచనలు పంపే అధికారం మాకు లేదని తెలుసు. అయితే పార్టీలోపల నేడు నెలకొనివున్న అసాధారణ పరిస్థితి రీత్యా మేమీక్రమాన్ని తీసుకోవలసి వచ్చింది.

ఉజ్వలమైన, సరైన చైనా కమ్యూనిస్టుపార్టీ 1970 నవంబరులో భారత్‌లో మన విముక్తి పోరాటానికి సంబంధించి విలువైన, సోదర పూర్వక సూచనలు పంపిందని మీకందరకూ ఇప్పటికే తెలిసివుంటుందని ఆశిస్తున్నాము.

ఆ విలువైన సూచనల్లో కొన్ని భాగాలను మన అవసరం రీత్యా ఇక్కడ ఉల్లేఖిస్తున్నాము ఆ సూచనలు :

1. వామపక్ష దుస్సాహసికవాదం, మితవాద పెడధోరణులు రెంటికీ వ్యతిరేకంగా పోరాటం సాగించి చైనాపార్టీ పెరిగిందీ; అభివృద్ధి చెందింది.
2. మూడు ఆయుధాలవల్ల చైనా విప్లవం విజయ వంతమైంది. అవి : ఎ. పార్టీ; బి. ప్రజాసైన్యం; సి. ఐక్య సంఘటన.
3. ఒక పార్టీ ఛైర్మన్‌ను మరొక పార్టీ ఛైర్మన్‌గా పిలవటం తప్పు. అది ఆ దేశపు కార్మికవర్గ జాతీయ భావాలను గాయపరుస్తుంది.
4. ఐక్య సంఘటనకు సంబంధించిన మీ భావం తప్పు. కొన్ని స్థావర ప్రాంతాలు ఏర్పడిన తర్వాత ఐక్యసంఘటన ఏర్పడుతుందని మీరు అన్నారు. ఇది యాంత్రిక అవగాహన. ఐక్య సంఘటన ఒక ప్రక్రియాక్రమం. పోరాటపు ప్రతిదశలోనూ ఐక్య సంఘటన ఏర్పడుతుంది; భగ్నమౌతుంది. ఇది ఒక శాశ్వత నిర్మాణంకాదు. కార్మిక-కర్షక ఐక్యత దీని పునాది అనటంలో సందేహం లేదు. అయితే పీడితులకూ, పీడకులకూ (ఈ పీడకులు విప్లవ ప్రధాన లక్ష్యంగా వుండరు) మధ్య ఐక్యత అన్నది ఐక్యసంఘటన వెనుకనున్న ప్రధాన అవగాహన. బూర్జువా వర్గాన్ని మొత్తంగా దళారీగా స్వాభావీకరించటం తప్పు.
5. బహిరంగ ట్రేడుయూనియన్ల, ప్రజాసంఘాల ఏర్పాటుకూ, ప్రజా ఉద్యమాలకూ కాలం చెల్లిపోయింది. రహస్య హత్యలే ఏకైక మార్గం అన్న సూత్రీకరణకు సంబంధించి : దీనిని పునరాలోచించాలి. మీరు వాడిన "సంహారక" అన్న పదాన్ని మొదట మేము తప్పుగా అర్థం చేసుకున్నాం. ఛైర్మన్ మావో సంహారక యుద్ధం నుండి ఈ భావనను మీరు తీసుకున్నారను కున్నాము. 1970 జులై సంచిక లిబరేషన్ (సిపిఐ-ఎంఎల్ పత్రిక) నుండి సంహరణ అంటే రహస్య హత్యలని మాకర్థమయింది.
6. లిన్‌పియావో ప్రజాయుద్ధ సిద్ధాంతాన్ని మీరు యాంత్రికంగా అన్వయించారు. లిన్‌పియావొ చెప్పిన గెరిల్లాయుద్ధసిద్ధాంతం సైనిక వ్యవహారం. 'జపాను వ్యతిరేక ప్రతిఘటనా యుద్ధసమయంలో మాకు 10 లక్షల సైన్యముంది. ఆనాడు కొందరు కామ్రేడ్లు స్థిరయుద్ధ తంత్రం, చలన యుద్ధ తంత్రాలను ప్రజలను సమీకరించే మార్గమన్న నినాదాన్ని ముందుకు తెచ్చారు. ఈ తప్పు నినాదానికి సమాధానంగా ప్రజలను సమీకరించేందుకు గెరిల్లా యుద్ధమే ఏకైక మార్గమ'ని లిన్‌పియావో అన్నారు. రాజకీయ, నిర్మాణ సమస్యలకు సైనిక సిద్ధాంతంతో సంబంధం వుండదు.
7. వర్గ శత్రువు రక్తంలో చేతులు ముంచని విప్లవకారుడు కమ్యూనిస్టుకాడు అన్న సూత్రీ కరణకు సంబంధించి : కమ్యూనిస్టుపార్టీ ఇక నేమాత్రమూ కమ్యూనిస్టు పార్టీగా మిగలజాలదు
8. వ్యవసాయ విప్లవాన్ని నొక్కివక్కాణించలేదు. రాజ్యాధికారాన్ని కైవశం చేసుకోవాలన్న నినాదాన్ని భూమి సమస్యకు పోటీపెట్టారు. వ్యవసాయ కార్యక్రమంలేదు.
9. ప్రజాపోరాటాలు, ప్రజాసంఘాలు లేకుండా రైతాంగ సాయుధ పోరాటాన్ని నిలకడగా సాగించలేము. రాజ్యాధికారాన్ని హస్తగతం చేసుకునే పోరాటంగా మాత్రమే నక్సల్బరీ పోరాటాన్ని చైనా కమ్యూనిస్టు పార్టీ సమర్థించలేదు. మొదట చైనాలోనూ, తర్వాత లిబరేషన్ పత్రికలోనూ నక్సల్బరీ సమర్థనగా ప్రచురించిన "వసంతకాల మేఘగర్జన" వ్యాసం దీనిని స్పష్టం చేస్తుంది.
10. ఒక నాయకుడి అధికారం, గౌరవం సృష్టించబడవు. అవి, పెరిగి అభివృద్ధి చెందుతాయి.
11. సిపిఐ(ఎం-ఎల్) సాధారణ అవగాహన సరైనది; దాని విధానం తప్పు.

సోదర పార్టీ నుండి వచ్చిన విలువైన సూచనలను, విమర్శలను మేమంగీకరిస్తున్నాము. మన దేశంలో వ్యవసాయ విప్లవ ప్రయోజనాల దృష్ట్యా, కా॥ చారుమజుందార్ నాయకత్వంలోని మనపార్టీ కేంద్రకమిటీ పై సూచనలను వెంటనే అంగీకరించి, ఆత్మ విమర్శ చేసుకుని, తప్పులను సరిదిద్దుకుని వుండవలసిందని మేము గట్టిగా భావిస్తున్నాము.

ఈ విలువైన సూచనల నుండి పాఠాలను తీసుకోవటానికి కా॥ చారుమజుందార్, ఆయన నాయకత్వంలోని కేంద్రకమిటీ తిరస్కరించటం మాకు నిరాశా, బాధా, కోపమూ కలిగించింది. సోదర పార్టీ చేసిన సూచన పట్ల ఆయనకేమైనా మినహాయింపులుంటే, సోదరపార్టీ సూచనలను అన్ని పార్టీ యూనిట్లలో చర్చకొరకు పంపకం చేసి వుండవలసిందని మేము అభిప్రాయపడుతున్నాము. ఆయన ఈ కార్యక్రమాన్ని తీసుకోవటంలో విఫలమయ్యాడు. ఫలితంగా పార్టీలోపల అసంతృప్తి, చర్చలు తలెత్తాయి. భారత కమ్యూనిస్టు ఉద్యమంలో గతంలో అనుసరించిన చెడ్డ ఆచరణ యిది.

నక్సల్బరీ రైతాంగ తిరుగుబాటు ఉజ్వల పంథా నుండి కేంద్ర కమిటీ, కేంద్ర పార్టీ పంథా వైదొలగాయని మేము విశ్వసిస్తున్నాము. అంటే, సాయుధ రైతాంగ విప్లవానికి సంబంధించి "వసంతకాల మేఘగర్జన" అన్న ప్రఖ్యాత వ్యాసంలో చెప్పిన పంథానుండి వారు తమ రైతాంగ ఉద్యమంపై నివేదిక చూపిన పంథా వైదొలగింది. మన విధానం అతివాద దుస్సాహసిక పెడధోరణికి గురైందనీ, ఫలితంగా అతివాద దుస్సాహసిక తప్పుడు పద్ధతి అవలంబించబడి ప్రస్తుత పార్టీ చీలికలకు దారితీసిందనీ, కామ్రేడ్ సుశీతల్‌రాయ్ ఈ తప్పుడు పద్ధతి బాధితుడనీ, దీని కారణంగా సాయుధ వ్యవసాయ విప్లవం ఆటంకపరచబడిందనీ మేము విశ్వసిస్తున్నాము.

ఏ గ్రూపుతోనూ మేము కట్టుబడిలేమని ప్రకటిస్తున్నాము. సిపిఐ (ఎం-ఎల్) లోపలా, బయటా మావో ఆలోచనా విధానంపై నమ్మకమున్న గ్రూపులతో మా సంబంధాలు శతృపూరితమైనవికావు. పార్టీ ప్రధాన కార్యదర్శిగా కా॥ చారుమజుందార్ అతివాద దుస్సాహసిక పెడధోరణికి ప్రధాన బాధ్యుడని మేము విశ్వసిస్తున్నాము. అదే సమయంలో, పార్టీ మొదటిమహాసభలో మొదటి కేంద్ర కమిటీకి ఎన్నికైన సభ్యులందరూ, ప్రస్తుత కేంద్ర కమిటీలోకి కో ఆప్ట చేసుకున్న సభ్యులందరూ పరోక్షంగానో, ప్రత్యక్షంగానో అతివాద దుస్సాహసిక పెడధోరణికి తమ బాధ్యత నుండి తప్పించుకోజాలరని మేము విశ్వసిస్తున్నాము.

ఈ క్రింద సంతకాలు చేసిన మేము పూర్తి అంకిత భావంతోనూ, సూటిగానూ మా నేరాన్ని అంగీకరిస్తున్నాము. దీనికి సంబంధించి మా కామ్రేడ్లు చేసిన విమర్శలను ధైర్యంగా అంగీకరిస్తున్నాము. పూర్తి నిజాయితీతో ఆత్మ విమర్శ చేసుకుంటున్నామని కూడా ప్రకటిస్తున్నాము. గత, ప్రస్తుత కేంద్ర కమిటీ సభ్యులందరూ తమ తప్పును అంగీకరించి, మన సాయుధ వ్యవసాయ విప్లవ ప్రయోజనాల దృష్ట్యా స్వీయ విమర్శ చేసుకొమ్మని కోరుతున్నాము.

కా॥ చారు మజుందార్ ప్రవచించిన అతివాద దుస్సాహసిక పంథాను తిరస్కరించేందుకూ, నిజాయితీగల ఆత్మవిమర్శ చేసుకొమ్మని ఆయనను కోరేందుకూ, మనసాయుధ వ్యవసాయ విప్లవానికి సంబంధించి తన తప్పును అంగీకరించమని కోరేందుకూ పార్టీ సభ్యులూ, సానుభూతి పరులందరినీ ముందుకు రమ్మని మేము విజ్ఞప్తి చేస్తున్నాము. కేంద్ర కమిటీ సభ్యులను విమర్శించమనీ, వారు తప్పును అంగీకరించి ఆత్మవిమర్శ చేసుకొమ్మని అడగమనీ పార్టీ సభ్యులనూ, సానుభూతి పరులనూ కోరుతున్నాము. నేడుపార్టీలో ప్రధాన ప్రమాదంగా వున్న అతివాద పెడధోరణిపై పోరాడుతుండగా, రివిజనిజం పట్ల మరింత జాగరూకతతో మనం వుండాలి.

తమ తమ ప్రాంతాల్లోని పోరాటాల సమీక్షను తయారు చెయ్యమనీ, పార్టీలో వాటిని చర్చించటం ప్రారంభించండనీ, "వసంతకాల మేఘగర్జన" వ్యాసం చూపిన నక్సల్బరీ పంథా వెలుగులో తప్పులను సరిచేసుకొండనీ, ఉజ్వలమైన, సరైనదైన చైనా కమ్యూనిస్టు పార్టీ సూచనలను ఎలాంటి మినహాయింపు లేకుండా ప్రాతిపదికగా ఆమోదించండనీ, నూతన ఐక్యతను నెలకొల్పి సాయుధ వ్యవసాయ పోరాటాన్ని ముందుకు తీసుకుపొండనీ మన పార్టీ సభ్యులందరికీ విజ్ఞప్తి చేస్తున్నాము.

**కానూసన్యాల్**
**చౌదరి తేజేశ్వరరావు**
**సౌరేన్ బోస్**
**డి. నాగభూషణ్ పట్నాయక్**
**కొల్లా వెంకయ్య**
**డి. భువనమోహన్ పట్నాయక్**

**(1972 నవంబర్ 4న 'ఫ్రాంటియర్'లో ప్రచురితమైన 'లేఖ'కు తెలుగు అనువాదమిది)** ◈

## పెంచిన విద్యుత్ ఛార్జీలను ఉపసంహరించుకోవాలని డిమాండ్‌చేస్తూ రాష్ట్రసదస్సు

రాష్ట్రప్రభుత్వం విద్యుత్ ఛార్జీలను పెంచింది. రాబోవు అయిదేళ్ళలో పెంచబోమని ఎన్నికలకు ముందు ప్రజలకు చేసిన వాగ్దానాన్ని కాంగ్రెస్ తుంగలో తొక్కింది. వినియోగదారులందరిపైన ఫ్యుయల్ సర్‌ఛార్జీల పేరిట రు.642 కోట్ల భారాన్ని మోపింది. ఒకవైపు ప్రజలమీద ఛార్జీల భారం మోపుతూ, మరోవైపు విద్యుత్ సంస్థలకు నష్టం కల్గించే అనేక హానికర నిర్ణయాలను తీసుకుంటున్నది. సబ్‌స్టేషన్‌లను ప్రైవేటీకరించే ప్రయత్నాలను చేస్తున్నది. ఈ అంశంపై నిర్వహిస్తున్న రాష్ట్రసదస్సులో పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నాం.

**17-4-2011 ఉదయం: 10.30 గంటలకు**

**సుందరయ్య విజ్ఞానకేంద్రం, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్**

**సదస్సులో 10 రాజకీయపార్టీలకు చెందిన రాష్ట్రనాయకులు ప్రసంగిస్తారు**

సిపిఐ(ఎం) సిపిఐ సిపిఐ(ఎం-ఎల్)
సిపిఐ(ఎం-ఎల్)న్యూడెమోక్రసి ఎంసిపిఐ(యు) ఎస్‌యుసిఐ(సి)
సిపిఐ(ఎం-ఎల్) ఆర్‌ఎస్‌పి ఎంఎల్ కమిటి ఫార్వర్డ్ బ్లాక్

# బల్క్‌డ్రగ్ పరిశ్రమ స్థాపనకు వ్యతిరేకంగా ప్రజల, రైతుల ఆందోళన

**కృష్ణాజిల్లా** - జగ్గయ్యపేట మండలం, ముక్త్యాల-నల్గొండ జిల్లా మేళ్ళచెరువు మండలం, దొండపాడు గ్రామ సరిహద్దుల్లో వివిన్ లేబొరేటొరీస్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో బల్క్‌డ్రగ్ ఫ్యాక్టరీని 59.50 ఎకరాలలో నిర్మించేందుకు నిర్మాణానికి ప్రభుత్వం అంగీకరించింది. పరిసర ప్రాంతాల ప్రజల, రైతుల జీవితాలను, పంటపొలాలను విషతుల్యం చేసే ఈ పరిశ్రమ నిర్మాణానికి వ్యతిరేకంగా ప్రజలు ఒకవైపు తీవ్ర ఆందోళన చెందుతుండగా కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో ప్రజాభిప్రాయ సేకరణ తంతును ముగించటానికి ప్రభుత్వం పూనుకుంది.

తొలుత పరిశ్రమ నిర్మించబోయే స్థలంలోనే 2010 ఆగస్టు 4న ప్రజాభిప్రాయ సేకరణకు పూనుకోగా, రైతుల, ప్రజల తీవ్ర అభ్యంతరాలతో, తీవ్ర నిరసనలతో ఆ కార్యక్రమాన్ని 2010 నవంబర్ 25వ తేదీకి వాయిదా వేశారు. ప్రభుత్వ అధికారులకు ఆ ప్రాంత రైతులు, ప్రజలు విజ్ఞప్తులు చేస్తూ బల్క్‌డ్రగ్ పరిశ్రమ నిర్మాణాన్ని గట్టిగా వ్యతిరేకిస్తూ వుండటంతో ఆ తేదీన కూడా ప్రజాభిప్రాయసేకరణ జరపకుండా 2010 డిసెంబరు 12వ తేదీకి వాయిదా వేసి, తదనుగుణమైన ఏర్పాట్లు చేసుకొని ఆరోజున నిర్వహించారు.

ఫ్యాక్టరీకి అడ్డువస్తున్నారని భావించిన రైతులను పోలీసులు వివిధ రూపాల్లో బెదిరింపులకు గురిచేశారు. వారి కుటుంబ సభ్యులను హెచ్చరించారు. ఆ విధంగా కొందరిని కట్టడి చేశారు. మరోవైపున పరిసర గ్రామాల్లోని కొందరుపెత్తందార్లను పరిశ్రమ యాజమాన్యం ఆకట్టుకుని వారి ద్వారా మరికొందరిని అదుపు చేయించారు. నోరుగల మరి కొందర్ని ప్రలోభాలకు గురిచేశారు.

200 మంది వరకు పోలీసు బలగాలను ప్రజాభిప్రాయ సేకరణ సందర్భంగా మోహరింపజేసి ప్రభుత్వం ఒక భయానక వాతావరణం సృష్టించింది. తద్వారా తీవ్ర నిరసన, భిన్నాభిప్రాయం వ్యక్తంగాకుండా ఖాకీల నీడలో ప్రజాభిప్రాయ సేకరణ తంతును ముగించారు. అప్పటికే రైతుకూలీసంఘం కృష్ణా జిల్లాకమిటీ ఆధ్వర్యంలో బల్క్‌డ్రగ్ పరిశ్రమ కారణంగా రానున్న దుష్పరిణామాలను వివరిస్తూ వివరణాత్మకమైన కరపత్రాన్ని ప్రచురించి చుట్టుప్రక్కల గ్రామాలలో ప్రచారం సాగించటంతో పాటు 2010 డిసెంబరు 31న జరిగిన ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమములో రైతుకూలీ సంఘం జిల్లా నాయకత్వం పాల్గొని తన నిరసనను, అభ్యంతరాలను వ్యక్తం చేసింది.

రైతు కూలీసంఘం జిల్లా నాయకులు ఈ సందర్భంగా మాట్లాడుతూ నిరుద్యోగ సమస్యను పరిష్కరించటం కోసం పరిశ్రమను నెలకొల్పుతున్నామని చెప్పే ప్రభుత్వం, ఈ పరిశ్రమ కోసం భూముల సేకరణ సందర్భంగా పండ్లతోటల పెంపకం కోసమని అవాస్తవాలు చెప్పటాన్ని నిలదీశారు. పర్యావరణ నివేదిక అంతా తప్పుల తడకగా వుందనీ, కాలుష్యాన్ని నివారిస్తామని యాజమాన్యం చెప్పేవన్నీ బూటకమేననీ వివరించారు. ఈ భూముల సేకరణ ద్వారా ఉపాధి కోల్పోతున్న వారెంతమంది? నూతనంగా నిర్మించబోయే పరిశ్రమ ద్వారా ఉపాధి పొందేది ఎందరు అనే ప్రశ్నకు యాజమాన్యం, ప్రభుత్వ అధికారులు సమాధానం చెప్పలేదు. కావున కాలుష్య నియంత్రణే చేయలేని అధికారులు ప్రమాదకర కాలుష్యకారక పరిశ్రమలకు అనుమతినివ్వటం ద్వారా ప్రజల, రైతుల జీవనోపాధినీ, జీవితాలనీ దెబ్బతీయవద్దని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆందోళనసాగుతున్నది. ◈

# లిబియాపై సామ్రాజ్యవాద దురాక్రమణ

**ఐక్యరాజ్యసమితి** భద్రతా మండలితో "విమానాలు ఎగరరాని ప్రాంత"మన్న పేరిట తీర్మానం చేయించి, "యుద్ధపర్వ ఉదయ దండయాత్ర" పేరిట అమెరికా నాయకత్వంలో సామ్రాజ్యవాద నాటోకూటమి లిబియాపై దాడులకు పూనుకుంది. లిబియా ప్రజలపై గడ్డాఫి ప్రభుత్వం సాగిస్తున్న మారణకాండను అడ్డుకుని పౌరులకు రక్షణ కల్పించే మానవీయ కర్తవ్యాన్ని నెరవేరుస్తున్నామని చెప్పుకుంటున్నాయి. గడ్డాఫీని ప్రభుత్వం నుండి తొలగించటమే తమ లక్ష్యమనీ, ప్రజల నుండి పూర్తిగా వేరుపడిపోయిన గడ్డాఫీ పాలన కూలిపోతుందనీ, పౌరులకు రక్షణనిచ్చే పని పూర్తయిన వెంటనే సైనిక దాడులు ఆగిపోతాయని ప్రచారం చేస్తున్నాయి.

మార్చి 19న లిబియాపై ఫ్రెంచి వైమానిక దాడులు ప్రారంభమైన వెంటనే దానిని ఖండిస్తూ కేంద్రకమిటీ చేసిన ప్రకటనలో "అమెరికా, యూరోపు సామ్రాజ్యవాద దేశాలు లిబియాపై పూర్తిస్థాయి దురాక్రమణ యుద్ధానికి ఈ వైమానిక దాడులు ప్రారంభమ"ని ఖండించింది.

## మానవీయ కారణాలు!?

ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి తీర్మానం సంఖ్య 1973 ఇలా పేర్కొంది : "4.పౌరుల రక్షణ : లిబియాలోని ఏ ప్రాంతంలోనూ, ఏ రూపంలోనూ విదేశీ ఆక్రమణ దళాలుండరాదన్న షరతుతో, లిబియా ఆరబ్ జమాహిరియా (ప్రజాప్రభుత్వం)లో దాడి ప్రమాదానికి గురౌతున్న పౌరులనూ, పౌరనివాసిత ప్రాంతాలనూ రక్షించేందుకు అవసరమైన అన్ని చర్యలనూ తీసుకునే అధికారాన్ని-చర్య తీసుకుంటామని ప్రధానకార్యదర్శికి తెలిపిన సభ్యదేశాలకూ, వారి ప్రాంతీయ కూటములకూ ఇస్తున్నది".

ఈ తీర్మానంతో భద్రతా మండలి లిబియాపై దాడి చేసేందుకు సామ్రాజ్యవాద దేశాలకు ఆమోదం తెలిపింది. ఇతర సభ్య దేశాల ఆంతరంగిక వ్యవహారాల్లో జోక్యం చేసుకోరాదన్న ఐరాస లక్ష్యప్రకటనకు విరుద్ధంగా తీర్మానం చేసింది. దీనికి అది చెప్పిన కారణం పౌరుల రక్షణ. దానికి సామ్రాజ్యవాదులిచ్చిన తాత్పర్యం మానవీయత! బాంబులు, క్షిపణి దాడులతో శాంతిని, ప్రజాస్వామ్యాన్ని ప్రసాదిస్తారన్నమాట!

ఇలాంటి తీర్మానం చేయటం భద్రతా మండలికి కొత్తేమికాదు. యుగోస్లావియా, ఆఫ్ఘనిస్తాన్, ఇరాక్‌లపై దురాక్రమణలను ఆమోదిస్తూ ఇలాంటి తీర్మానాలే చేసింది. 1990లలో యుగోస్లావియాపై నాటో దాడిని ఆమోదిస్తూ ఇలాంటి తీర్మానమే చేసింది. పర్యవసానం 40 రోజుల పాటు విమానాలతో బాంబుల వర్షం కురిపించారు. రాజధాని బెల్‌గ్రేడ్‌తో సహా నగరాలన్నీ నేల మట్టమయ్యాయి. యుగోస్లావియాను ముక్కలు చేశారు. జాతుల నిర్మూలన సాగింది. చివరకు యూరపులోకెల్లా అతిపెద్ద సైనిక స్థావరాన్ని-బాండ్‌స్టీల్ శిబిరాన్ని-అమెరికా నిర్మించింది. కొసావోలో టెర్రరిస్టు ముఠాకు అధికారాన్ని కట్టబెట్టింది. ఇదంతా మారణకాండను ఆపే 'మానవత్వం' తోనే జరిగింది.

ఈ"మానవీయ" కారణంతోనే ఆఫ్ఘన్ మహిళలను అణచివేస్తున్న తాలిబాన్లను తరిమివేసే మిషతో అమెరికా దురాక్రమణకు భద్రతా మండలి ఆమోద ముద్ర వేసింది. ఇది ఆఫ్ఘన్ ప్రజల ఊచకోతకు దారితీసింది. ఈ 'మానవీయ' విధ్వంసం ఇంకా సాగుతూనే వుంది. గ్రేటర్ బలూచిస్తాన్ పేరిట ఆఫ్ఘనిస్తాన్‌ను విడగొట్టే పథకాన్ని అమలు చేసే పనిలో వున్నారు.

ఇరాక్‌లో సామ్రాజ్యవాదుల పాశవికత్వం మరింత నగ్నంగా సాగింది. మొదట ఆంక్షల విధింపుతో 5 లక్షల పసిపిల్లలకు మందులు లేకుండా చేసి మృత్యువాత పడవేశారు. "విమానాలు ఎగురనీయమనే" పేరిట దాడులతో లక్షలాది పౌరులను చంపారు. నీటి సరఫరా, మురుగునీటి తొలగింపు, రవాణా వ్యవస్థలను ధ్వంసం చేశారు. చివరికి సైన్యంతో దురాక్రమణ చేశారు. చారిత్రక పత్రాలనూ, పురావస్తు ప్రదర్శనశాలలనూ దోచుకున్నారు. పాఠశాలలు, ఆస్పత్రులను నేలమట్టం చేశారు. చివరకు ఉత్తర ఇరాక్‌ను కుర్ధిస్తాన్ పేరిట విడగొట్టారు.

ఇప్పుడు లిబియాలో ఇదే జరుగుతున్నది. సైనిక నిర్మాణాలతోపాటుగా, పౌరవిమానాశ్రయాలనూ, రోడ్లనూ, రేవులనూ, కమ్యూనికేషన్ కేంద్రాలనూ ధ్వంసం చేశారు. అక్కడ పరిశ్రమలు పెట్టిన విదేశీ కంపెనీలు మూతవేసి తరలిపోయాయి. వాటిలో పనిచేస్తున్న ఆసియా దేశస్తులు, మధ్యప్రాచ్యదేశస్తులూ, సహారాప్రాంతదేశస్తులు లిబియా వదిలి వెళ్లిపోయారు. ఆర్థిక వ్యవస్థ కుప్పకూలింది. రాత్రికి రాత్రే ఉద్యోగాలు పోయిరోడ్డున పడ్డారు. ఆహార, వంటగ్యాసు కొరత ఏర్పడింది. "విమానాలు ఎగురకుండా కాపలా" అన్న తీర్మానం పౌరులపై బాంబులువేయటంగా, ప్రభుత్వాన్ని కూల్చటంగా మారింది. వియత్నాంలో ప్రతి అంగుళం బాంబులు వేసిన అమెరికా సామ్రాజ్యవాదులు "గ్రామాలను రక్షించేందుకే వాటిని నాశనం చేస్తున్నామ"ని చేసుకున్న సమర్థింపునే యిప్పుడూ చేసుకుంటారు.

## టెర్రరిస్టు గడ్డాఫీ?!

లాకర్‌బీ విమానం కూల్చివేసిన టెర్రరిస్టులకు ఆశ్రయమిచ్చాడన్న మిషతో రీగన్ అధ్యక్ష పాలనా కాలంలో అమెరికా లిబియాను టెర్రరిస్టు దేశంగా ప్రకటించింది. ఆంక్షలు విధించింది. 2001లో ఇరాక్‌పై అమెరికా దండయాత్ర తర్వాత గడ్డాఫీ సామ్రాజ్య వాదులను సంతృప్తిపరిచే చర్యలు తీసుకున్నాడు. విదేశీ బ్యాంకులకూ, బహుళజాతి కంపెనీలకూ ద్వారాలు తెరిచాడు. ప్రభుత్వ రంగ సంస్థలను, ప్రత్యేకించి చమురు కంపెనీలని ప్రైవేటీకరించాడు. దీనితో లిబియాను టెర్రరిస్టు లిస్టునుండి అమెరికా తొలగించింది. ఆంక్షలను ఎత్తివేసింది. యూరపు సామ్రాజ్యవాద దేశాల నాయకులు ఎర్రతివాచీ పరిచి గడ్డాఫీకి స్వాగతం పలికారు. క్యూలు కట్టి లిబియా పర్యటనలకు వెళ్లారు. ప్రతిగా గడ్డాఫి అమెరికా టెర్రరిస్టులని ముద్రవేసిన వారిపై చర్యలు తీసుకున్నాడు. పాలస్తీనియన్లను లిబియానుండి పంపించివేశాడు. ఆల్‌ఖైదా నాయకులను అరెస్టు చేశాడు. ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల కమీషన్ 2010లో మానవ హక్కులను రక్షిస్తున్న దేశంగా గడ్డాఫీ ప్రభుత్వానికి సర్టిఫికెట్ యిచ్చింది. సామ్రాజ్యవాదుల ముందు ఇంత మోకరిల్లినా గడ్డాఫి సాధించేదేమీ లేదు. సామ్రాజ్యవాద వ్యతిరేక శక్తులకు దూరమయ్యాడు. సామ్రాజ్యవాద దాడులనెదుర్కోలేని బలహీనుడయ్యాడు. చివరకు లిబియా దాడికి గురైంది.

అమెరికా ట్రెజరీశాఖ అధిపతి స్టువర్టు లీవీ 3వేల కోట్ల డాలర్ల లిబియా ఆస్తులను స్వాధీన పర్చుకుని, దానికి కారణంగా గడ్డాఫి హంతక నియంత అని ప్రకటించాడు (వాషింగ్‌టన్ పోస్టు 24-3-11) రాత్రికి రాత్రి నియంత ఐపోయాడు. గడ్డాఫి అక్రమార్జనలతో లండనులో చేకూర్చుకున్న ఆస్తులపై విచారణ జరిపి స్వాధీనం చేసుకుంటానని బ్రిటన్ ప్రకటించింది. అమెరికా ఆధిపత్య వాంఛలనుబట్టి పదాల అర్థాలెలా మారతాయో, నిన్నటి శత్రువు నేటి మిత్రుడెలా అవుతాడో అర్థమౌతుంది.

## విప్లవకారులా?!

పశ్చిమాన అట్లాంటిక్ సముద్రతీరాన మొరాకోనుండి తూర్పున అరేబియా సముద్రంలో బెహరీన్ వరకూ వున్న అరబ్ ప్రపంచంలో ప్రజ్వరిల్లిన ప్రజాందోళనల ప్రభావంతో లిబియాలో కూడా ప్రజలు తిరుగుబాటు చేశారు; నియంత గడ్డాఫీ నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా లిబియా విప్లవ ప్రజానీకం పోరాడుతున్నారు; వారికి మద్దతుగా వైమానిక దాడులు చేయటం సమర్థనీయమంటూ యూరపులోని "వామ" పక్షాలనే గ్రీను పార్టీలు ఈ దురాక్రమణ దాడులకు మద్దతు తెలుపుతున్నాయి.

ట్యూనీసియా, ఈజిప్టు తదితర దేశాలలో నిరసన ప్రదర్శనల రూపంలో ప్రజాందోళనలు సాగాయి. దేశవ్యాపితంగా లక్షలాది ప్రజానీకం వీటిలో పాల్గొన్నారు. నిరంకుశ పాలకులు గద్దెదిగాలని నినదించి రాజకీయ మార్పును అజండాగా తెచ్చారు. కాగా లిబియాలో తూర్పు ప్రాంతం చమురు బావులున్న బెంఘాజీ నగరంలో సాయుధ తిరుగుబాటుగా మొదలైంది. సామ్రాజ్యవాదుల తొత్తుగా పనిచేసిన మాజీరాజు ఇద్రిస్ పాలనకు ప్రతీకగావున్న జండాను వీరు ఎగురవేశారు. ఇద్రిస్‌కు, అతని కుటుంబానికి విశ్వసనీయంగా వున్న ఆదివాసీ తెగల నాయకులు వున్న ప్రాంతమిది. మధ్యధరా సముద్ర తీరాన వీలర్ సైనిక స్థావరాన్ని అమెరికా ఏర్పాటు చేసేందుకు ఇద్రిస్ అనుమతించాడు. దీనిని గడ్డాఫీ మూసివేయించాడు. తిరుగుబాటు ప్రారంభమైన వెంటనే జాతీయ మధ్యంతర సమితిని ఏర్పాటు చేశారు. ఈ సమితి నాయకులుగా యూరపు-అమెరికాకు వలసవెళ్లి నయాఉదారవాదాన్ని సమర్థించేవారు వున్నారు. గడ్డాఫీ ప్రభుత్వం నుండి ఫిరాయించి మధ్యంతర సమితిలో నాయకులుగా చేరిన వారున్నారు. గడ్డాఫీ ప్రభుత్వంలో న్యాయశాఖా మంత్రిగా వుండి తిరుగుబాటు ముందురోజు వరకూ అసంతృప్తి వాదుల్ని తీవ్రంగా శిక్షించిన మహమ్మద్ అబ్దుల్ జలీల్, బహుళజాతి కంపెనీలను లిబియాలోకి ఆహ్వానించే విధానాన్ని అమలు చేసిన మహమ్మద్ జఫ్రి, గతంలో భారత్‌లో లిబియా రాయబారిగా పనిచేసిన అల్‌అజీజ్ అల్‌ఐసావాలు సమితి నాయకులుగా చేరారనీ ఫైనాన్సియల్ టైమ్స్ పత్రిక (23-3-2011) రాసింది. ఈ సమితికి అధ్యక్షుడు గడ్డాఫీ ప్రభుత్వంలో అంతరంగిక శాఖామంత్రి అబ్దుల్ ఫతాయూనిస్. సమితి సైనిక అధ్యక్షుడు ఒమర్ హరిరి. లిబియాలో ప్రజాస్వామిక డిమాండ్లతో సాగిన గత ఉద్యమాలను పాశవికంగా అణచివేసిన చరిత్ర వీరిద్దరికీ వుంది. ఈ సమితి లిబియా సమాజంలో ప్రజాస్వామిక సంస్కరణలను తెచ్చే కార్యక్రమమేదీ ప్రకటించలేదు, కాగా వారు సంస్కరణలంటున్నది నయా ఉదారవాద విధానాలనే. గడ్డాఫీవైపునుండి ఈ ఉన్నత సైనికాధికారులు ఫిరాయించినా, సామాన్య సైనికులను తమ వెంట తీసుకురాలేకపోయారు.

తమకు మద్దతుగా సామ్రాజ్యవాదులు విమాన దాడులు చేస్తున్నప్పుడు, సమితి నాయకత్వంలోని తిరుగుబాటుదారులు గడ్డాఫీ సైన్యంపై దాడులు సాగిస్తారని ఎవరైనా భావిస్తారు. కానీ జరిగిందిదికాదు. బెంగాఝీలో గడ్డాఫీ విప్లవకమిటీల సభ్యుల్ని అరెస్టు చెయ్యటం, చంపివెయ్యటం చేశారు. లిబియాలోని నీగ్రో పౌరులపైనా, సహారా ప్రాంత దేశాల నుండి వలస వచ్చిన కార్మికులపైనా, ఆసియా, టర్కీ దేశాల నుండి వలస వచ్చిన కార్మికులూ, ఉద్యోగులపైనా దాడులు చేశారు. ఈ వాస్తవాన్ని యూరపు, అమెరికా పత్రికలే వ్రాసాయి. ఈ శక్తులు ప్రజాస్వామిక సంస్కరణలు తెస్తాయన్న ఆశలేదు. అమెరికా సామ్రాజ్యవాదుల గోచీలు పట్టుకుని అధికార గద్దెనెక్కడమే వీరి లక్ష్యం.

ఆల్‌ఖైదాతో సంబంధాలున్న టెర్రరిస్టులకు ఆశ్రయమిస్తున్నాడని గడ్డాఫీపై అమెరికా ఆరోపణ చేసింది. ఈ టెర్రరిస్టు శక్తులలో అధికశాతం నేడు తిరుగుబాటు దారులంటున్న వారి ఆధీనంలో వున్న బెంగాఝీ ప్రాంతంలోనే వున్నారు. (అలెగ్జాండర్ కాక్‌బర్న్, కౌంటర్ పంచ్ 24-3-2011). సామ్రాజ్యవాదులను సంతృప్తి పరచటంలో భాగంగా గత ఆరేళ్లుగా గడ్డాఫీ ఈ అల్‌ఖైదా శక్తులపై దాడి చేశాడు. ఆఫ్ఘనిస్తాన్, ఇరాక్‌లలో అమెరికా నుండి నైపుణ్యం పొందిన ఈ "పవిత్రయుద్ధ" నినాద శక్తులు సాపేక్షంగా లౌకిక పద్ధతులనుసరించే గడ్డాఫీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా తిరుగుబాటులో చేరారు. ఒక వేళ గడ్డాఫీ పాలనను కూల్చివేయగా ఏర్పడే కొత్త ప్రభుత్వపు కళ్లాలు ఎంతటి ప్రతీపశక్తుల చేతుల్లోకి పోతాయో ఊహించటం కష్టంకాదు.

తిరుగుబాటుదారుల నాయకత్వపు తిరోగమన స్వభావాన్ని ఎత్తిచూపించటమంటే, గడ్డాఫీ పాలన సజావుగా సాగిందని సమర్థింపుకాదు. చమురు అమ్మకాల ద్వారా వచ్చిన ఆదాయంతో సామాజిక సంక్షేమ కార్యక్రమంగా విద్య, వైద్యాలను అందుబాటులోకి గడ్డాఫీ ప్రభుత్వం తెచ్చింది. ఉపాధి, గృహ సౌకర్యాలు మెరుగు పరిచాడు. సాపేక్షకంగా లౌకిక విధానాన్ని అనుసరించాడు. అయితే రివల్యూషనరీ కౌన్సిల్ అనేపేరున్న పార్లమెంటు వున్నా గడ్డాఫీ పార్టీ విధానాలే అమలు జరిగే విధంగా ఏర్పాటుంది. వర్గ వ్యత్యాసాలున్నాయి. ఫలితంగా ప్రజల ప్రజాస్వామిక అకాంక్షలూ, డిమాండ్లు గతంలో ముందు కొచ్చాయి. వాటిని గడ్డాఫీ అణచివేశాడు. ఫలితంగా లిబియా ప్రజల్లో గడ్డాఫి సమర్థకులూ, వ్యతిరేకులూ కూడా వున్నారు.

లిబియాలో ఎలాంటి ప్రభుత్వం అధికారంలో ఉండాలో నిర్ణయించవలసిందెవరన్నది ఇక్కడ కీలక సమస్య. నిస్సందేహంగా అలా నిర్ణయించుకోవాల్సింది లిబియా ప్రజలే. అమెరికా, యూరపు సామ్రాజ్యవాదులు కాదు.

"గడ్డాఫీ ప్రభుత్వాన్ని తొలగించటమే ఒబామా విధానలక్ష్యమ"ని ప్రకటించటం ద్వారా లిబియాలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే హక్కు తనదేనని అమెరికా స్పష్టం చేసింది. ఈ తిరుగుబాటుదారులనే వారికి ఆర్థిక సైనిక సహాయమందించటం ద్వారా తన నయా ఉదారవాద విధానాలను అమలు జరిపే దోపిడీ వర్గ శక్తులను అధికారంలోకి తెచ్చేందుకు పూనుకుంది. అవసరమైతే లిబియానుండి బెంగాఝీలుని విడదీసేందుకు కూడా అది వెనుకాడదు.

## ఆర్థిక దిగ్బంధనం

భద్రతా మండలి 1973వ తీర్మానంలోని ఒక భాగం ఇలావుంది. "19 ఆస్తుల స్థంభన : ఐరాస తీర్మానం సంఖ్య 1970 లోని 17,19,20,21 పేరాలలో విధించిన ఆస్థుల స్థంభన సభ్య దేశాలలో లిబియా ప్రభుత్వం ప్రత్యక్షంగానో, పరోక్షంగానో కలిగివున్న లేదా దాని అదుపులో వున్న అన్ని నిధులకూ, ఇతర ద్రవ్య ఆస్థులకూ, ఆర్థిక వనరులకూ వర్తిస్తుందని నిర్ణయించటమైనది."

లిబియా నుండి చమురు కొనుగోలు చేసిన చమురు కంపెనీలు చెల్లించవలసిన డబ్బును స్వాధీనం చేసుకుని గడ్డాఫీ ప్రభుత్వానికి ఆర్థిక సంక్షోభాన్ని కల్పించి కూల్చి వేయటానికి చేయించిన తీర్మానమిది. ఒక దేశాన్ని తన శత్రుదేశంగా ప్రకటించి యుద్ధం ప్రారంభించేటప్పుడు తీసుకునే చర్యయిది. యుద్ధం ముగిసిన తర్వాత అదే ప్రభుత్వానికో లేదా కొత్తగా ఏర్పడిన ప్రభుత్వానికో ఆస్థులను తిరిగి అప్పజెప్పుతారు. కాని స్వాధీనం చేసుకున్న ఆస్థులను ఖర్చుపెట్టరు. కాగా భద్రతా మండలి తీర్మానం ఇంకా ఏం చెప్పిందో చూడండి :

"20. 1970 నెంబరు తీర్మానంలోని 17వ పేరా దఖలు పరిచిన అధికారంతో స్వాధీన పరచుకున్న ఆస్థులను వీలయినంత త్వరగా లిబియా అరబ్ జమాహీరియా ప్రజల సంక్షేమం కొరకు అందుబాటులో వుంచాలి."

లిబియా ప్రజలకు ఏది సంక్షేమమని అమెరికా భావించిందో దాని కోసం స్వాధీనం చేసుకున్న ఆస్థులను అమెరికా ఖర్చు చేయటాన్ని ఐరాస ఆమోదించింది. ఎక్కడా లిబియా ప్రభుత్వం అన్న పదాన్నే వాడలేదు. వాస్తవానికి తీర్మానం జరగటానికి ముందే లిబియా తిరుగుబాటుదారులతో ఈ ఆస్థుల అందజేత గురించి వివరమైన సంభాషణలు జరిగాయి. ఆ తర్వాత తిరుగుబాటు దారులు లిబియా చమురు అమ్మకాల నిధులను తమ కందజేయటానికి వీలుగా "జాతీయ మధ్యంతర సమితి"ని లిబియా ప్రభుత్వంగా గుర్తించాలని సామ్రాజ్య వాదులకు విజ్ఞప్తి చేసాయి. వెంటనే ఫ్రాన్సుతో మొదలుపెట్టి అమెరికా, బ్రిటన్, ఇటలీలు జాతీయ మధ్యంతర సమితిని గుర్తించి, చమురు నిధులను దానికి తరలించాయి.

భద్రతా మండలి తీర్మానం లిబియాలోకి ఒక్క ఆయుధం కూడా వెళ్లకుండా "ఆయుధ దిగ్బంధం" చేయాలని చెప్పింది. స్వాధీనం చేసుకున్న ఆస్థులను ఇవ్వటంలో తీర్మానభాగాన్ని అమలు జరిపిన సామ్రాజ్యవాద దేశాలు ఆయుధ దిగ్బంధనాన్ని అమలు చేయలేదు. తిరుగుబాటుదారులకు ఆయుధాలు సరఫరా చేశాయి. "మేము సరఫరా చేసిన వాటిలో మారణాయుధాలు లేవ"ని సమర్థించుకున్నారు. మరణం కలిగించని ఆయుధమేమిటో వారి నుండి తెలుసుకోవాలి.

కల్నల్ కలీఫా హఫ్తార్ 1988లో అమెరికా గూఢచారి సంస్థ తోడ్పాటుతో లిబియా నేషనల్ ఆర్మీని ఏర్పాటు చేశాడు. సూడాన్‌లో స్థావరం పెట్టుకుని లిబియాలో తిరుగుబాటు తెచ్చే ప్రయత్నాలు చేశాడు. సామ్రాజ్యవాదాన్ని సంతృప్తి పరిచే చర్యలు గడ్డాఫీ మొదలు పెట్టగానే అమెరికాకు ఇతని అవసరం తీరింది. ఇన్నేళ్లూ అమెరికాలోని వర్జీనియా రాష్ట్రంలో వున్నాడు. అప్పుడితనిని లిబియా తిరుగుబాటు దళాలకు కమాండరుగా నియమించినట్లు, నాటో సైన్యానికీ తిరుగుబాటు దళాలకూ మధ్య లైజాన్‌గా వ్యవహరిస్తాడనీ ప్రకటించింది. (వాషింగ్‌టన్ పోస్టు 30-3-2011) క్రమశిక్షణలేని తమ తిరుగుబాటు దళాలను హఫ్తార్ దారిలో పెట్టగలడంటూ లిబియా తిరుగుబాటు నాయకులు ఆహ్వానించారు. హఫ్తార్ ఇప్పుడు లిబియా చేరాడు. తిరుగుబాటు దళాలు అమెరికా కనుసన్నల్లో నడిచేవనీ వాటికి స్వతంత్ర ప్రతిపత్తిలేదనీ ఇది స్పష్టం చేస్తున్నది.

## ప్రపంచాధిపత్య వ్యూహం

అమెరికా ప్రపంచ దేశాలపై ఆధిపత్యం నెరిపే వ్యూహంలో భాగంగానే లిబియాపై దాడులకు దిగింది. అది కేవలం ఆర్థిక ప్రయోజనాలు, లేక శక్తి వనరుల స్వాధీనం లేక సైనిక వ్యవస్థ కోసమే ఈ దాడికి పూనుకోలేదు. ఈ ప్రయోజనాలు కాపాడుకొనే ఆధిపత్య స్థాపనకోసం ఈ దాడికి పూనుకుంది.

ఆర్థిక ఆంక్షలకు గురై, ఇబ్బందులకు లోనైన గడ్డాఫీ ప్రభుత్వం సామ్రాజ్యవాదులను సంతృప్తి పరిచే వైఖరి తీసుకుంది. ప్రపంచబ్యాంకు విధించిన షరతులకు అంగీకరించి వ్యవస్థాగత సర్దుబాటు కార్యక్రమాన్ని అమలు జరిపింది. ఆహారం, పెట్రోలుపై సబ్సిడీలను దిగకోసి ధరలు పెంచింది. ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణ చేపట్టింది. చమురు అన్వేషణ, వెలికితీతలను సామ్రాజ్యవాద కంపెనీలకు అప్పగించింది. బ్రిటన్‌కు చెందిన బ్రిటీష్ పెట్రోలియంకు కువాయట్, బెల్జియం దేశాలంత వైశాల్యమున్న రెండు ప్రాంతాలను చమురు అన్వేషణకు ఇచ్చాడు. జపానుకు చెందిన మిట్సుబిషి, నిప్పన్ పెట్రోలియంలతోపాటు ఐదు కంపెనీలతో

(తరువాయి 6వ పేజీలో)

# లోక్‌సభలో పెన్షన్‌బిల్లు
# ప్రధాన పాలకవర్గ పార్టీల నిజస్వభావం

**మనదేశంలో** ప్రధాన పాలకవర్గ పార్టీలైన కాంగ్రెసు, బిజెపిలు తాము రాజీలేని ప్రత్యర్ధులమనీ, మన దేశప్రజల ప్రయోజనాలను రక్షించటంకోసమే తమ మధ్య వైరం సాగుతున్నదనీ, భారత ప్రజలను నమ్మించ జూస్తున్నాయి. పార్లమెంటులోనూ, దాని బయటా, పత్రికలూ, టీవీల ముందుకూ, బహిరంగంగానూ ప్రతిరోజూ ఏదోఒక అంశంపై ప్రత్యర్ధిని తీవ్రంగా విమర్శిస్తున్నాయి. తాము ప్రజల ప్రయోజనాలు కాపాడేవారిగానూ చూపెట్టుకుంటున్నాయి. ఆ విధంగా మన దేశంలోని పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో ఉత్కంఠను సృష్టిస్తూ, ఈ రాజకీయ, సామాజిక, ఆర్ధిక వ్యవస్థ చూపెట్టిన రక్షకులం తామేనన్న భ్రమలు ప్రజలలో కలిగిస్తున్నాయి.

సామ్రాజ్యవాద, బడాబూర్జువాల ప్రయోజనాలకు సేవ చేయటమన్న అంశం ముందుకొచ్చినప్పుడు మాత్రం పార్లమెంటరీ నాటకాలతో తమ నిజమైన వర్గ స్వభావాన్ని, ప్రజావ్యతిరేక అసలు స్వభావాన్ని ఈ రెండు ప్రధాన పార్టీలూ కప్పిపుచ్చుకోలేక పోతున్నాయి.

2011 మార్చి 24న పెన్షను (నిధుల క్రమబద్ధీకరణ, అభివృద్ధి అధికార) బిల్లు 2011 (ఇక నుండి పెన్షను బిల్లు అందాం)ను లోక్‌సభలో ప్రవేశ పెట్టిన తాజా ఉదంతం రెండు ప్రధాన పాలకవర్గ పార్టీల నిజస్వభావాన్నీ, మన దేశ ప్రజల ప్రయోజనాలకు మొనగాళ్లుగా నిలుస్తున్నామన్న వారి నాటకపు అసలు రంగునూ బయటపెట్టింది.

నయాఉదారవాద పెట్టుబడిదారీ ఆర్ధిక విధానాలపై ఆధారపడిన, అమెరికా సామ్రాజ్యవాదం నిర్దేశించిన, ప్రపంచబ్యాంకు రుద్దుతున్న సామ్రాజ్యవాద ప్రపంచీకరణ అమలుతో, కష్టభరిత త్యాగాలూ, తీవ్రపోరాటాలతో మన దేశ కార్మిక వర్గం సాధించుకున్న సంక్షేమ, సామాజిక భద్రతా సౌకర్యాలను అమలు చేయకుండా తప్పించు కోవటం ప్రారంభమైంది. కార్మికవర్గం పోరాడి సాధించుకున్న చట్టవిహిత సంక్షేమ సౌకర్యాలను కూడా తిరగదోడుతున్నాయి.

సామాజిక సంపదల ప్రైవేటీకరణ, వాణిజ్యంపై ప్రభుత్వ అదుపు తొలగింపు, మానవ జీవనాన్నీ, శ్రమనూ మొత్తంగా మార్కెట్టు శక్తులకు వశపరచటమే ప్రపంచ దేశాలపై సామ్రాజ్యవాద ప్రపంచీకరణ రుద్దుతున్న నయా ఉదారవాద రాజకీయాల సారాంశం.

మన దేశ పాలక వర్గాలూ, వారి ప్రతినిధులైన పాలక పార్టీలూ సామ్రాజ్యవాదపు ప్రయోజనాలకు సేవ చేసేందుకు విశ్వసనీయంగా పని చేస్తున్నాయి. ఆ విధంగా ప్రజలచేత, ప్రజల కొరకు, ప్రజల ప్రజాస్వామ్య మనబడేదాన్ని మార్కెట్టుశక్తుల చేత, మార్కెట్టు శక్తుల కొరకు నడిచే వ్యవస్థగా సామ్రాజ్యవాద ప్రపంచీకరణ దిగజార్చింది.

ఈ నేపథ్యంలో చూసినప్పుడు లోక్‌సభలో పెన్షనుబిల్లు ప్రవేశ పెట్టడమూ, దానికోసం జరిగిన వోటింగు ప్రహసనపు నిజ స్వభావం అర్ధమౌతుంది.

మన దేశంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉద్యోగులు పొందుతున్న సంక్షేమ సౌకర్యమే పెన్షను. నిర్వచించబడిన సౌకర్యం ప్రకారం వారు పెన్షను పొందుతారు. చివరి నెలలో పొందిన జీతం ప్రాతిపదికగా పదవీ విరమణ తర్వాత నెలవారిగా పెన్షను పొందేందుకు ఈ ఉద్యోగులు అర్హులు, కాగా పెన్షను నిధుల కోసం వీరు ఉద్యోగంలో వున్నప్పుడు పొందిన వేతనం నుండి వారేమీ చెల్లించ నవసరం లేదు. ఆయా ప్రభుత్వాలే వీటిని చెల్లిస్తాయి.

అయితే మన దేశంలో ఆర్ధిక సరళీకరణ విధానాలతో కాంగ్రెసు, బిజెపిల నాయకత్వంలోని ప్రభుత్వాలు ఉద్యోగులకూ, కార్మికులకూ సామాజిక సంక్షేమం, సామాజిక భద్రత కల్పించే బాధ్యతను వదిలి వేసుకునేందుకు నిర్ణయించాయి. వాటికయ్యే వ్యయాన్ని ఉద్యోగులూ, కార్మికులే భరించాలని పట్టుపడుతున్నాయి. అదే సమయంలో తన బాధ్యతను వదిలివేసు కుంటున్నట్లుగా పాలితులకు కన్పించకుండా చేసేందుకు ప్రయత్నిస్తున్నాయి. సామాన్యులు ఎంత అమాయకంగా కన్పించినా ప్రభుత్వం సామాజిక బాధ్యతను వదిలి వేస్తానంటే అంగీకరించరు. సామాజిక బాధ్యతలు నిర్వర్తించడానికి ఓటువేశామని వారికి తెలుసు కనుక ఈ రెండు ప్రధాన పాలకవర్గ పార్టీలూ తమ విధానాలకు మద్దతు నిచ్చే మేధావులతో, నిపుణులనే వారితో కలిసి తప్పు ప్రచారాన్ని సాగించాయి. అత్యధిక శాతంగా వున్న అసంఘటిత రంగ కార్మికులకూ, ఉద్యోగులకూ ఎలాంటి సామాజిక భద్రతా సౌకర్యాలు లేవనీ, కాగా కొద్ది మందిగావున్న ప్రభుత్వ ఉద్యోగులూ, ప్రభుత్వ రంగ కార్మికులూ మాత్రమే ఈ సౌకర్యం పొందుతున్నారనీ కొత్తగా కనుక్కున్నట్లుగానే ప్రచారం చేశారు. ఈ సౌకర్యాలు పొందని వారి బాధలు గురించి మొసలికన్నీరు కార్చి ఈ సౌకర్యాలు వారికి అందక పోవటానికి ప్రభుత్వ ఉద్యోగులూ, కార్మికులే కారణమన్న తప్పుభావనను వ్యాప్తి చేశారు. ఆ విధంగా వారందరికీ సామాజిక భద్రతా సౌకర్యాలు కల్పించటంలో తమ వైఫల్యాన్ని కప్పిపుచ్చుకునేందుకు ప్రయత్నించారు. ఈ ప్రచారం తర్వాత సంస్కరణల పేరిట 2004లో నూతన పెన్షన్ విధానాన్ని తెచ్చారు. 2004 తర్వాత ఉద్యోగంలో చేరిన వారందరు తమ వేతనం నుండి పెన్షనుకు కొంత మొత్తం చెల్లించాలని నిర్దేశించారు. ప్రభుత్వ ఉద్యోగులకు పెన్షను అందించటంవల్ల తనకు ఏర్పడే ఆర్ధిక బాధ్యతను సంస్కరణల పేరిట తగ్గించుకుని, పెన్షను సౌకర్యం అందించాల్సిన బాధ్యతను వదులుకున్నారు.

తిరిగి 2009 మే 1న పౌరులందరికీ పెన్షను సౌకర్యాన్ని విస్తరించే పేరుతో లబ్దిదారులే వాటా చెల్లించాలన్న సూత్రంతో జాతీయ పెన్షను పథకాన్ని ప్రారంభించారు. నూతన పెన్షను పథకంలో సభ్యులయ్యే వారు చెల్లించే నిధులను ప్రోగు చేసుకోవటమే దీని అసలు ఉద్దేశ్యం.

ఉద్యోగుల ప్రావిడెండుఫండుకు ప్రభుత్వ రంగ కార్మికులూ, ఉద్యోగులు చెల్లించిన నిధులు పెద్దయెత్తున ప్రభుత్వ అజమాయిషీలోకి వచ్చిన అనుభవం పాలక వర్గాలకూ, పాలక పార్టీలకూ ఉంది. ఈ నిధులను ప్రభుత్వ సెక్యూరిటీలు, బాండ్లతో మదుపు పెట్టి ప్రభుత్వం వినియోగించుకుంది. కొద్ది మందిగా వున్న ప్రభుత్వరంగ కార్మికులు చెల్లించిన నిధులే గుట్టలుగా పోగుపడగా దానిలో చాలాకొద్ది భాగం మాత్రమే సౌకర్యాలుగా వారికి చెల్లిస్తున్నది. ఇక మొత్తం కార్మికవర్గమంతా, వ్యవసాయ కూలీలు, గ్రామీణ ఉపాధి పథకంలో పని చేసేవారు. రోజువారీ వేతన కార్మికులు, కాంట్రాక్టు కూలీలు ఈ చెల్లింపులు చేయటం జరిగితే పోగయ్యే నిధి ఎంత ఎక్కువ స్థాయిలో వుంటుందో వూహించుకోవచ్చును.

నయాఉదారవాదం నిర్దేశిస్తున్న ఆర్ధిక సంస్కరణలకూ, వాటిని తూచా తప్పకుండా పాటిస్తున్న భారత పాలకులకూ నోరూరిస్తున్నది ఈ నిధులే.

ఒక సామాజిక సంక్షేమ పథకంగా ఉద్యోగుల ప్రావిడెండుఫండు మనదేశ కార్మికవర్గానికి ఉపయోగపడే, చర్య. ఇది అసంఘటిత రంగంలోని కార్మికుల్లో ఆశలు రేకెత్తించింది. తమకు కూడా అలాంటి సౌకర్యం కావాలన్న డిమాండును వారిలో తెచ్చింది. దీనికోసం వారు ఆందోళనలు చేశారు.

అయితే ప్రావిడెండు ఫండుకు తమ వాటాను చెల్లించాల్సివస్తున్నందున యజమానులు దీనిని అసంఘటిత కార్మికులకు వర్తింప చేసేందుకు సుముఖంగాలేరు. ఇలాంటి పథకం బాధ్యత తమకు లేకుండా చేసుకోవాలన్న ఉద్దేశ్యంతో వున్నారు. వీలయితే ఈ పథకాన్ని, ఇతర కార్మిక సంక్షేమ పథకాలనూ రద్దు చేయించాలని కోరుకుంటున్నారు.

ఈ అంశాలిలా వుండగా, ప్రభుత్వం దేశంలోకి విదేశీ పెట్టుబడుల ప్రవేశానికి అనుమతినిచ్చింది. దోపిడీతో అధిక లాభాలు గడించేందుకు మన దేశంలో వున్న అవకాశాలను విదేశీ పెట్టుబడి పరిశీలించింది. బీమా రంగం, పెన్షనురంగంలోకి ప్రవేశిస్తే ఎన్నోలాభాలు గడించగలమన్న నిర్ధారణకొచ్చాయి. ఈ విదేశీ పెట్టుబడులు ఇప్పటికే స్టాకు మార్కెట్టులోకి ప్రవేశించి జూదమయ ఆర్ధిక కార్యకలాపాలతో లాభాలార్జిస్తున్నాయి. వారికళ్లు భారత కార్మికులు పొదుపు చేసే ఈ నిధులపై పడ్డాయి. ఈ నిధులను కబళించేందుకు తమకవకాశ మివ్వమని ప్రభుత్వంపై వత్తిడి తెస్తున్నాయి. విదేశీ పెట్టుబడులకు దళారీలుగావున్న భారత బడాబూర్జువా వర్గం కూడా ఈ రంగాలలోకి విదేశీ పెట్టుబడులను అనుమతించవలసిందిగా ప్రభుత్వంపై వత్తిడి తెస్తున్నది. ప్రావిడెంటుఫండు, పెన్షను నిధులలో విదేశీ పెట్టుబడుల మదుపుపై గరిష్ఠ పరిమితి పెట్టరాదనీ, కార్మికులు పొదుపు చేసిన ఈ నిధులను జూదగృహాలైన స్టాకు మార్కెట్టులో మదుపు పెట్టేందుకు చట్టపరంగా అన్ని చర్యలు తీసుకొమ్మనీ కోరుతున్నాయి.

మొదట 2011 మే నెలలో ప్రవేశపెట్టాలనుకున్న పెన్షన్‌బిల్లును ముందుగానే లోక్ సభ ముందుంచటానికి కారణమిదే. అమెరికా కోటీశ్వరుడు వారన్‌బఫెట్ భారతపర్యటనకు వచ్చి భారత ద్రవ్యరంగంలో విదేశీ పెట్టుబడుల మదుపుపై వున్న గరిష్ఠ పరిమితిని ఎత్తివేయాలని కోరటమూ, అలా ఎత్తివేస్తే బీమారంగంలో తాను మదుపు పెడతాననటంతో, భారత పాలకవర్గాలూ, పాలక పార్టీలూ సామ్రాజ్యవాద దోపిడీకి సేవ చేసే నయాఉదారవాద విధానాల అమలుకు కట్టుబడి వున్నామని నిరూపించుకునేందుకే బహుశా ముందుగానే పెన్షనుబిల్లును ప్రవేశ పెట్టారు. దీని ద్వారా దేశంలో పరిస్థితులన్నీ తమ అదుపులోనే వున్నాయనీ, ఈ విధానానికి వ్యక్తమౌతున్న వ్యతిరేకతను పట్టించు కోనవసరంలేదనీ భారత పాలకులు సామ్రాజ్యవాద పెట్టుబడికి విన్నవించుకున్నారు.

ఈ బిల్లు ప్రవేశపెట్టిన సందర్భం పాలకవర్గ పార్టీల స్వభావాన్ని బయటపెట్టింది. లోక్‌సభలో సిపియం సభ్యుడు బాసుదేవ్ ఆచార్య బిల్లును ప్రవేశపెట్టాలన్న అంశంపై సభలో ఓటింగు జరగాలని కోరాడు. బిల్లును వ్యతిరేకించమని బిజెపి నాయకుడు అద్వానీని కోరాడు. "యుపిఏ మొదటి ప్రభుత్వం ఈ బిల్లును మనమిద్దరం (సిపియం, బిజెపి) వ్యతిరేకించాం. ఆ బిల్లునే ఇప్పుడు పెడుతున్నారు" అని గుర్తుచేశాడు. లోక్‌సభలో అప్పుడు బిల్లును గెలిపించుకోగల సంఖ్యలో కాంగ్రెసు సభ్యులు లేరు. బిజెపి బిల్లుకు వ్యతిరేకంగా ఓటు చేస్తే యుపిఏ ప్రభుత్వం పడిపోయివుండేది. అయినా బిల్లుకు అనుకూలంగా ఓటు చేసింది.

మొదటి యుపిఏ ప్రభుత్వం ఈ బిల్లును పెట్టినప్పుడు, 60 మంది వామపక్షపార్టీల మద్దతు కాంగ్రెసుకుంది. వారు బిల్లును వ్యతిరేకించారు. తాను కూడా వ్యతిరేకించటం ద్వారా కాంగ్రెసు నాయకత్వంలోని యుపిఏలో చీలిక తేవచ్చునని బహుశా అది అలా చేసివుంటుంది తప్ప ఆ బిల్లులోని కార్మిక వ్యతిరేక, ప్రజావ్యతిరేక అంశాలతో విబేధించి కాదన్నది స్పష్టం.

కానీ ఇప్పుడు పార్లమెంటరీ క్రీడలో పై చెయ్యి ఎవరిదని చూపెట్టుకునే సమయం కాదు; సామ్రాజ్య వాదానికీ, దాని నిర్దేశిత నూతన ఆర్ధిక విధానాలకూ తమ విశ్వాసపాత్రతనూ, అమలునూ చూపించుకోవాల్సిన సమయం. అలాంటి సమయం వచ్చింది. కనుకనే ఎలాంటి సణుగుడూ లేకుండా బిజెపి పెన్షను బిల్లుకు అనుకూలంగా ఓటు చేసింది. పాలకవర్గాలు కోరిన చట్టపర చర్యలకు ఎలాంటి జాప్యం జరగకుండా చూసింది. కాంగ్రెసు ప్రభుత్వం ప్రవేశపెట్టిన పెన్షను బిల్లుకు బిజెపి మద్దతు, వారి పార్లమెంటరీ ఆటలో అసాధారణమేమీకాదు. అలాంటి మద్దతు నివ్వకపోతేనే ఎవరైనా ఆశ్చర్య పడాలి. ఎందుకంటే అవిరెండూ ఒకే లక్ష్యంగా పాలక వర్గాలకు ప్రాతినిధ్యం వహించే పార్టీలే. సామ్రాజ్యవాదులకు, అమెరికా సామ్రాజ్యవాదుల ప్రయోజనాలకు, బడాబూర్జువాలకూ సేవచేయటమే వారిరువురి లక్ష్యం. నూతన ఆర్ధిక విధానాలను మరింత శక్తివంతంగా ముందుకు తీసుకుపోతానని ప్రధానమంత్రి పదేపదే ప్రకటిస్తుండగా, తాను వెనకబడిపోవటానికి బిజెపి ఇచ్ఛగించదు. సామ్రాజ్యవాదుల సేవలో కాంగ్రెసుకు తానెంత మాత్రమూ తీసిపోనని అది చూపెట్టుకొంటుంది. అధికార పీఠం కోసం అదిపోటీ వదలుకోదు. కనుకనే సామ్రాజ్యవాదం ముందు తనవిశ్వసనీయతను చూపుకొనేందుకు తన చిరకాల ప్రత్యర్ధికి మద్దతివ్వటానికి అది వెనుకాడలేదు.

రెండు పాలక వర్గ పార్టీల మధ్య వైరాన్ని కాసేపలా వుంచి పెన్షను బిల్లులోని అంశాలూ, వాటి పర్యవసానాలను పరిశీలిద్దాం. ఈ పరిశీలన తిరిగి ఈ పాలక వర్గపార్టీల అసలు స్వభావాన్ని తేటతెల్లం చేస్తుంది.

ఈ బిల్లు కోట్లాది పౌరులకు సామాజిక భద్రతనిస్తుందని ప్రచారం సాగుతున్నప్పటికీ, ఈ బిల్లు వెనుకనున్న ఉద్దేశ్యాలు భిన్నంగా వున్నాయి.

పెట్టుబడిదారుల సంఘాలు సంస్కరించమని కోరుతున్న, నయాఉదారవాద ఆర్ధిక విధానాలు నిర్దేశిస్తున్న సంస్కరణలు అమలు జరుగుతున్న రంగం భారత దేశపు ద్రవ్యరంగం. దీనిలో భాగమే పెన్షను నిధులు. విదేశీ పెట్టుబడి దీనిలో మదుపు పెట్టాలని కోరుకుంటున్నారు. ఆలశ్యమవుతున్నందుకు అవి అసహనంతోవున్నాయి. అందువల్ల ప్రావిడెండుఫండు నుండి డబ్బు తీసుకుని స్టాకు మార్కెట్టు జూదమాడటం వారికి సాధ్యపడటంలేదు.

ఇప్పుడు ప్రవేశపెట్టిన పెన్షను బిల్లులో చాలా మెలకువగా విదేశీ పెట్టుబడుల గురించి మాట్లాడకుండా వూరుకుంది. బిల్లు చట్టమైన తర్వాత విదేశీ పెట్టుబడులను పార్లమెంటు అనుమతి అవసరం లేకుండానే అనుమతించేందుకు అవకాశాన్ని అట్టిపెట్టుకుంది.

ఇక ఈ బిల్లు ప్రకారం కార్మికులు చెల్లించిన పెన్షను నిధులను విదేశీ, స్వదేశీ బడా పెట్టుబడిదారులకు లేదా వారి ద్రవ్యసంస్థలకూ యిస్తారు. వారు ఈ నిధులతో స్టాకు మార్కెట్టులో వాటాలు కొంటారు. వారు లాభాలు గడించుకుని, కొంత వడ్డీని నిధికి యిస్తారు. ఈ ఆదాయం నుండి పాలన తదితర ఖర్చులు పోగా మిగిలిన దానిని కార్మికులకు ఇస్తారు. ప్రావిడెంటు ఫండు నిధులను బాండుల రూపంలో ప్రభుత్వం అప్పు తీసుకుని కొన్నేళ్ళ తర్వాత వడ్డీతో చెల్లించేది. ఆ డబ్బును ప్రభుత్వ డ్యాములు కట్టడానికో, పరిశ్రమ పెట్టడానికో వాడేది. దానివల్ల ప్రభుత్వానికొచ్చే లాభనష్టాలతో సంబంధం లేకుండా వడ్డీయిచ్చేది. ఇప్పుడు ప్రావిడెండు ఫండును ప్రైవేటు రంగానికిస్తున్నారు. హర్షద్‌మెహతా కుంభకోణం గుర్తుతెచ్చుకుంటే, ప్రస్తుత ప్రైవేటీకరణ విధానాలు లేనప్పుడే ప్రభుత్వ బ్యాంకుల నుండి వేలకోట్లు మింగివేశారు. ఇప్పుడు ఈ నిధులన్నీ "చట్టబద్ధం"గానే బడాబూర్జువాలకు కట్టబెడుతున్నారు. అంటే సామాజిక సంక్షేమ నిధులను స్టాకు మార్కెట్టు జూద నిధులుగా మార్చారు.

ఈ పచ్చిమోసాన్ని కప్పిపుచ్చుకునేందుకు, అర్ధంలేని వాగాడంబరంతో ఎలాంటి వాదనలు చేస్తున్నారో చూడండి. పెన్షను నిధికి చెల్లింపుల ద్వారా "భారత ఆర్ధిక వృద్ధిని నిర్మించిన కార్మికులు తమ జనాభా అనుకూలతతో భారత ఆర్ధిక వ్యవస్థ ఉత్పాదక పునాదిలో తమవాటానూ, భవిష్య ఆదాయాన్ని పొందగలరు". వారు అలా లబ్ధి పొందాలంటే ప్రావిడెంటు ఫండులో కార్మికులు, యజమానులూ చెల్లించే వాటాను కూడా నూతన పెన్షను పథకం క్రిందకు మార్చాల"ని బడా బూర్జువాలు డిమాండు చేస్తున్నారు. దీనినెలా సమర్ధించుకుంటున్నారో చూడండి. "మొత్తం కంప్యూటరీకరించబడి ఒక్కరే అన్ని రికార్డులు నిర్వహించినందున అతితక్కువ వ్యయంతో పాటు పర్యవేక్షణాలోపాలు తగ్గిపోతాయి కనుక ఉద్యోగుల ప్రావిడెండు ఫండు సంస్థకన్నా నూతన పెన్షను పథకం ఉత్తమమైనది."

భారత కార్మికుల పొదుపు సొమ్ముతో స్టాకు మార్కెట్టులోబడా బూర్జువాలు జూదమాడుతారు. స్టాకు మార్కెట్టు బాగుంటే (వారికి లాభాలు వస్తుంటే) భారత పారిశ్రామిక రంగం బాగున్నట్లట. అందువల్ల కార్మికులకు ఈ 'వృద్ధి"లో వాటాగా పొదుపుపై వడ్డీ, ఉద్యోగాలు వస్తాయట. కనుక మొత్తం కార్మికులు, ఉద్యోగుల పొదుపు నిధులన్నీ వారి కప్పగించాలట.

వాస్తవం దీనికి భిన్నంగా వుందన్నది కఠిన అనుభవం. రికార్డుస్థాయిలో స్టాకు మార్కెట్టు పెరుగుతున్నా సంఘటిత రంగంలో కార్మికుల సంఖ్య తగ్గిపోయింది. అయినా సరే కార్మికుల పై బడాబూర్జువా వర్గం ఎక్కడలేని ప్రేమ కురిపిస్తున్నది. ఎందుకంటే వారి పొదుపు నిధులను దిగమింగడానికి!

పార్లమెంటులో బిల్లు ప్రవేశపెట్టి రెండు వారాలు తిరగకుండానే విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల విధానాన్ని ప్రభుత్వం సడలించింది. పాతవిధానం ప్రకారం ద్రవ్య సంస్థలలో 29 శాతం మించి విదేశీ పెట్టుబడు లుండరాదు. భారత బడాబూర్జువాలతో కలిసి బీమా రంగంలో విదేశీ కంపెనీలు వెలిసాయి. కొత్తవిధానం ప్రకారం ఇప్పటికే సంయుక్తంగా వున్న కంపెనీలలో ప్రభుత్వ ముందస్తు అనుమతి లేకుండానే విదేశీ పెట్టుబడిదారుడు తనవాటాను ఎంతైనా పెంచుకోవచ్చు. పెన్షను బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టడం మాత్రమే జరిగింది. అది చట్టమయ్యేందుకు ఇంకా సమయముంది. అయినా అది చట్టమయిన మరుక్షణమే విదేశీ పెట్టుబడిదారుల ఆధీనంలోకి పోయేవిధంగా ద్రవ్య రంగాన్ని సంస్కరించారు.

ఈ విధంగా భారత కార్మికుల శ్రమ నుండి పొందిన వేతనాలతో వారిచే బలవంతంగా పొదుపు చేయించిన సొమ్మును దోపిడీ వర్గాలు దిగమింగే సాధనంగా పెన్షను బిల్లును తయారు చేశారు.

ఈ బిల్లును ప్రవేశ పెట్టడం ద్వారా కాంగ్రెసు, దానికి మద్దతు తెలపటం ద్వారా బిజెపిలు తాము ప్రత్యర్ధులమన్న ముసుగును తొలగించి తమ అసలుసిసలు దోపిడీవర్గ అనుకూల స్వభావాన్ని నగ్నంగా బయట పెట్టుకున్నాయి. పార్లమెంటులో శ్రమజీవుల ప్రయోజనాల కొరకు పాటుపడుతున్నామన్న తమ బూటకాన్ని మరోమారు బయటపెట్టుకున్నాయి.

# ఎర్రగడ్డ మానసిక వైద్యశాలపై ఎన్‌హెచ్‌ఆర్‌సి పరిశోధనలో వెలుగు చూసిన ఆర్థిక, సామాజిక కోణాలు

**1908లో** స్థాపించిన హైదరాబాద్‌లోని చారిత్రాత్మక ఎర్రగడ్డ మానసిక వైద్యశాల దుస్థితిపైన, ప్రభుత్వ నిర్లక్ష్యంపైన 2005 నుండి ఓపిడిఆర్, స్త్రీ విముక్తి సంఘటన సంఘాల ఆధ్వర్యంలో వివిధ దఫాలుగా చేసిన వాస్తవ సేకరణలు, విస్తృత ప్రచారాల అనంతరం 2005లో హైకోర్టు సువోమోటో కేసుగా స్వీకరించడంతో కొంత కదలిక మొదలైంది. కొన్ని పోస్టులు భర్తీ చేయడం, కొందరు పర్మినెంటు కావటం, కొంత మెరుగైన స్థితి ఏర్పడింది. **ఎన్‌హెచ్‌ఆర్‌సి** వివిధ సందర్భాలలో ఈ వైద్యశాలపై విచారణలు జరిపింది. దీనికి ముందుగా 1998-99లో బెంగుళూరు 'నిమ్‌హాన్స్' ప్రొఫెసర్ చెన్నబసవన్న ఆధ్వర్యంలో ఒక బృందం వాస్తవాల్ని సేకరించింది. 2005లో హైకోర్టు స్పందించిన తర్వాత 2006లో ఎన్‌హెచ్‌ఆర్‌సి మాజీ ఛైర్‌పర్సన్ జస్టిస్ రంగనాథ్ మిశ్రా ఆధ్వర్యంలో మరొక విచారణ జరిపి 'మానసిక వైద్యంలో నాణ్యతాప్రమాణాల హామీ', 'మానసికవైద్యం-మానవ హక్కులు' అన్న రెండు ప్రచురణల్ని కూడా విడుదల చేశారు.

ఈ నేపథ్యంలో 2010 జులై 19-21 తేదీలలో మాజీ ఐఏఎస్ అధికారి డా॥ లక్ష్మీధర్ మిశ్రా ఆధ్వర్యంలో కమీషన్ వస్తున్నట్లు తెలుసుకొని ప్రజాసంఘాల, హక్కుల సంఘాల ఆధ్వర్యంలో విచారణలో పాల్గొని సాక్ష్యాధారాలతో వ్రాతపూర్వకంగా నివేదికలు ఇచ్చారు. హాస్పిటల్‌లోని ఉద్యోగులు, అధికార్లు, పేషంట్లు, వారి బంధువులు, అన్ని విభాగాల ప్రజలు, సంఘాల నుంచి వివరమైన నివేదికలు సేకరించిన కమీషన్ సుదీర్ఘమైన నివేదికను ఇటీవల ప్రభుత్వానికిచ్చింది. ఎర్రగడ్డ మానసిక వైద్యశాల పరిస్థితుల్ని మెరుగు పరచాల్సిన ప్రభుత్వం వివిధ సందర్భాలలో తన నిర్లక్ష్యాన్ని కప్పిపుచ్చుకుంటూ కేంద్రప్రభుత్వం నుంచి 3 దఫాలుగా విడుదలైన 30 కోట్ల రూ॥ నిధుల్ని కూడా ఖర్చు పెట్టకుండా దారుణంగా వ్యవహరించిందని ఆ కమీషన్ రాష్ట్ర ఆరోగ్య కార్యదర్శిని నిలదీసింది.

ఈ రిపోర్టు వివరాల్ని వెలుగులోకి తెస్తూ 2011 మార్చి 31న స్త్రీ విముక్తి సంఘటన, ఓపిడిఆర్, ఏపిఎఫ్‌టియులు పత్రికా విలేఖర్ల సమావేశం నిర్వహించాయి. పత్రికల ద్వారా ప్రభుత్వ ప్రజారోగ్య విధానంలోని డొల్లతనాన్ని వెల్లడిజేశాయి.

## దక్షిణ భారతదేశంలోనే పెద్దది- ప్రధానంగా తెలంగాణా జిల్లాలకు ఏకైక దిక్కు

600 పడకలు గల ఈ హాస్పిటల్‌కి ప్రారంభంలో 48 ఎకరాల స్థలం కేటాయించబడింది. దక్షిణ భారతదేశంలోనే అతిపెద్దగా విస్తరించాల్సిన ఈ వైద్యశాల అడుగడుగునా నిర్లక్ష్యంతోనూ, మన రాష్ట్ర ప్రభుత్వ వివిధ శాఖల అవసరాల పేరుతోనూ చాలావరకు స్థలం కుదించుకు పోయింది. నిజాం వారసులమనీ, స్థలానికి హక్కుదారులమనీ సివిల్ కోర్టులో స్థల వివాదం నడుస్తూనేవుంది. క్షణాల్లో సెజ్‌లకు భూములు సేకరించి ఇచ్చే ప్రభుత్వాలకు, రాజకీయ నాయకులకు ఈ అత్యవసర వైద్యశాల స్థలాన్ని కాపాడాలన్న ధ్యాస ఎక్కడా కనిపించదు. ఈ హాస్పిటల్‌కి ప్రధానంగా తెలంగాణా గ్రామీణపేదలే వస్తుంటారు.

ఈ హాస్పిటల్‌కి ప్రతిరోజూ వచ్చే వందలాది మంది నిరుపేదలలో 1. కొత్తగా జబ్బుతో వచ్చేవాళ్ళు 2. డాక్టర్లకు మళ్ళా మళ్ళా చూపించుకోవలసిన అవసరముండి వచ్చే వాళ్ళు 3. సంవత్సరాల తరబడి మందుల కోసం వచ్చే వాళ్లుగా వుంటున్నారు. ఎంతో శ్రమపడి ఛార్జీలకు డబ్బు సంపాదించుకొని నెలల తరబడి ఇలా వస్తూవుండే వాళ్ళ సంఖ్య చాలా ఎక్కువ. గత 5 సంవత్సరాలుగా ఇక్కడికొచ్చే రోగుల సంఖ్యను గమనిస్తే చాలా విషయాలు అర్థమవుతాయి.

ఈ హాస్పిటల్ కొచ్చే పేషంట్లలో సుమారు 25 మందిని కమీషన్ నిశిత పరిశీలన చేసింది. మొత్తం పేషంట్ల సంఖ్యను పరిశీలించింది. 2009లో 1,03,596 కేసులు ఈ హాస్పిటల్‌లో రికార్డయ్యాయి. స్త్రీలు, పురుషులు కలిసి (2009లో) 7220 కొత్తకేసులు రికార్డయ్యాయి. 2010 జూన్ వరకే 4వేల కేసులు వచ్చినట్లు రికార్డ్ అయ్యింది. ఈ మొత్తం కేసుల్లో దారిద్ర్యరేఖకు దిగువనున్న వారే ఎక్కువని కమీషన్ తేల్చింది. ఇంకా ఎన్నో ఆసక్తికరమైన విషయాలు ఈ పరిశీలనలో వెలుగు చూశాయి.

ఒక కుటుంబంలో ఒక వ్యక్తికి మానసిక అనారోగ్యం తలెత్తడానికిగల కారణాలు రకరకాలుగా వున్నప్పటికీ దాన్ని సరైన సమయంలో, సరైన పద్ధతిలో గుర్తించి వైద్యం చేయించలేకపోవడం ఒక కారణం కాగా, తెలంగాణా, రాయలసీమ జిల్లాల నుంచి, కర్ణాటక, మహారాష్ట్ర జిల్లాల నుంచి ఇక్కడికొచ్చే వారంతా చాలా ఆలస్యంగా జబ్బు ముదిరాక ఇక్కడికొస్తున్నారు. దీర్ఘకాలికమైనదవడంచేత ప్రైవేటు హాస్పిటళ్ళలో చూపించుకునే స్థోమత లేక, ఈ హాస్పిటల్ గురించి తెలియడం తక్కువగా వుండటం కూడా ఒక కారణంగా వుందని తెలిసింది. ఒక కుటుంబంలో ఒక వ్యక్తికి ఈ జబ్బువస్తే ఆ కుటుంబమే సర్వనాశనమై పోతున్నస్థితిని కమీషన్ గమనించింది. కుటుంబంలో సంపాదిస్తున్న వ్యక్తి మానసిక జబ్బుకి గురయితే కుటుంబ పరిస్థితి మరింత త్వరగా దిగజారిపోవడాన్ని కమీషన్ పరిశీలించింది. అంటే సంవత్సరానికి 7వేల కుటుంబాలు (ఈ హాస్పిటల్ కొచ్చేవే) ఆర్థిక సంక్షోభంలో చిక్కుకుంటున్నాయన్నమాట. ఇక, విశాఖ మానసిక వైద్యశాల, ప్రైవేటు హాస్పిటళ్ళకి వెళ్ళే కేసుల్ని, మూఢనమ్మకాలతో దర్గాల చుట్టూ తిరిగేవారినీ పరిశీలిస్తే ఈ రాష్ట్రంలోనే ప్రతీ సంవత్సరం మానసిక వ్యాధిగ్రస్తుల సంఖ్య ఎంతగా పెరుగుతుందో ఇట్టే అర్థమవుతుంది..

మొత్తంగా స్కిజోఫీనియా ఏ కారణంగా వచ్చినా ఆత్మహత్యల వైపుగా వారు నెట్టబడుతున్నారు. ఆత్మహత్యల సంఖ్య పెరగడానికి, మానసిక దుర్బలత్వం ఏర్పడడానికి సంబంధముందని ఇటీవల హైద్రాబాద్‌లో సైకియాట్రిస్ట్ అసోసియేషన్ సదస్సులో వక్తలు ఏకాభిప్రాయాని కొచ్చారు. ఎలాంటి విశ్రాంతి లేకుండా పోటీ ప్రపంచంలో వత్తిడిని తట్టుకోలేనివారు, ఆర్థిక ఒత్తిడులు తట్టుకోలేని కుటుంబాలు, తాము సాధించాలనుకున్నది సాధించలేక మానసిక ఒత్తిడికి గురయ్యే వాళ్ళకు సరైన సమయంలో సరైన ప్రోత్సాహమూ, సరైన గైడెన్సు లేకపోవడమూ, ఒకవేళ జబ్బు వస్తే సరైన సమయంలో కౌన్సిలింగ్ ఇచ్చి వైద్యం కొనసాగించలేకపోవడం, దీనితో ప్రతీ సంవత్సరం ఈ సంఖ్య పెరుగుతూ వుందనీ వారు అభిప్రాయపడ్డారు.

ఎర్రగడ్డ హాస్పిటల్ కొచ్చే వాళ్ళంతా అత్యధికులు పేదవాళ్ళైనప్పటికీ కుటుంబాలకు కుటుంబాలే ఇక్కడ ఏళ్ళ తరబడి కాపురాలుంటున్నారు. బైట వండుకొని, తెచ్చుకొని తమ కుటుంబ సభ్యులు బాగుపడితే తాము మళ్ళీ మామూలు స్థితికి వస్తామనే ఆలోచనతో అక్కడే వుంటున్నారు. ఇంతగా ఈ హాస్పిటల్ అవసరముంటే ఈ హాస్పిటల్ పరిస్థితిని చూసి కమీషన్ నివ్వెరపోయింది. మూడుసార్లు ఎన్‌హెచ్‌ఆర్‌సి వాస్తవాల్ని సేకరించి రిపోర్టులిచ్చినా ఈ రాష్ట్ర వైద్యారోగ్యశాఖ వ్యవహరించిన తీరును డా॥ లక్ష్మీధర్ కమీషన్ స్వయంగా హెల్త్ సెక్రటరీని కలసి పరిస్థితిని వివరించారు.

ఈ హాస్పిటల్‌లో 80 మంది అవసరమున్న క్వాలిఫైడ్ సోషల్ వర్కర్ పోస్టులు ఒక్కటి కూడా భర్తీ కాలేదు. సైకియాట్రీట్రైన్డ్ నర్సింగ్ స్టాఫ్ లేరు. ఆక్యుపేషన్ థెరపీ యూనిట్‌గానీ, రిహాబిలిటేషన్ సెంటర్ గానీ, దానికోసం ప్రత్యేకంగా సిబ్బంది గానీ లేరు. ల్యాబ్ వసతి లేదు. సరైన మందులు అందుబాటులో లేవు. ఒక్కొక్కసారి పేషంట్ తీవ్రతను అదుపు చేయటానికి కొన్ని మత్తు బిళ్ళలతో నిద్రపుచ్చాల్సి వస్తుంది. కనీసం రోజుకి వందలాది మంది పేషంట్లు వస్తుంటే వారి డేటా రికార్డు చేయడానికి డాక్టర్ల ప్రక్కన సహాయకులు లేరు. క్లినికల్ సైకాలజిస్టులులేరు. తగినంత మంది 3వ, 4వ తరగతి సిబ్బందిలేరు. బి.పి. ఆపరేటర్స్, గ్లూకోమీటర్లు కూడా లేవు. చివరికి ఒక ల్యాండ్‌లైను టెలిఫోన్ కూడా లేదు. డాక్టర్లు, నర్సులు, పేషంట్లు, అటెండర్సు, స్టాఫ్‌కి ఎటువంటి రక్షణా లేదు. నిరంతరం పాములు, పురుగుల మధ్య తిరగాల్సి వస్తున్నది. ఈ హాస్పిటల్‌కి జనరేటర్ లేదు. (ఇటీవలే 5 జనరేటర్లు వస్తే ఇంతవరకూ సీలుకూడా తీయలేదు.)

మానసిక వైద్యంతో సంబధం లేని డాక్టర్లను, స్టాఫ్‌ని ఇక్కడకు డెప్యుటేషన్ మీద బదిలీ చేయడంతో సూపరింటెండెంట్, మరికొందరు ఆసక్తివున్న మానసిక వైద్యుల నిరంతర శ్రమమీదే ఈ హాస్పిటల్ నడవడం దారుణమని కమీషన్ వ్యాఖ్యానించింది. మానవ హక్కుల గురించి, ప్రజాస్వామిక హక్కుల గురించి, నిరంతరం మాట్లాడే ప్రభుత్వాలు ఆరోగ్యశ్రీల గురించి, వందలకోట్ల ఆరోగ్యశాఖ బడ్జెట్ గురించి మాట్లాడే ఈ ప్రభుత్వాలు ఇలాంటి హాస్పిటళ్ళపట్ల ఎంత నిర్లక్ష్యంగా వుంటాయో ఒక్క అంబులెన్స్ విభాగాన్ని చూస్తే తెలుస్తుంది.

2005 నుంచి గత 4 సంవత్సరాలలో ఈ హాస్పిటల్‌లో చనిపోయిన 22 మంది కేసులను కమీషన్ పరిశీలిస్తే ఒక్కరే ఆత్మహత్య చేసుకొని చనిపోయారు. రోగికున్న మానసిక వ్యాధితో పాటు వచ్చే రకరకాల-గుండె, కిడ్నీ, ఊపిరితిత్తులు, ఇతర జబ్బులతో చనిపోయిన వారే ఎక్కువ.

ఈ హాస్పిటల్‌లో సిటిస్కాన్ అవసరమైనా, ఎంఆర్‌ఐ, ఇతర పరీక్షలతోపాటు వైద్యం అవసరమైనా గాంధీ, ఉస్మానియాలకి తరలించాలి. అందుకోసం సమయానికి అంబులెన్స్ కూడా లేక, వెళ్ళినా అక్కడ రోజుల తరబడి నిరీక్షణతో మానసిక రోగులు తొందరగా చనిపోతున్నారని కమీషన్ ఇచ్చిన నివేదిక స్పష్టం చేస్తున్నది. మౌలిక సౌకర్యాలు కల్పించి ఈ హాస్పిటల్‌ని బెంగుళూరు 'నిమ్‌హాన్స్' తరహాలో అభివృద్ధి చేయాలని సూచించింది.

ఈ హాస్పిటల్ స్థలాన్ని కాపాడడంతో పాటు, ఉన్న స్థలానికి ప్రహరీగోడ నిర్మించి అసాంఘిక శక్తుల్ని లోపలికి రానివ్వకుండా కాపాడాలని కమీషన్ సూచించింది. ఈ హాస్పిటల్‌లో ఖైదీల వార్డుకి, మహిళల వార్డుకి, బాగా ఎక్కువ జబ్బుతో వున్న పేషంట్ల వార్డులకి రక్షణ యివ్వాలని సూచించింది. దీనితోపాటు ఆస్పత్రికున్న స్థలాన్ని చెట్లు, పచ్చికపెంచి రోగులకు ఆహ్లాదకర పరిసరాల్ని ఏర్పాటు చేయాలని సూచించింది. అంతో ఇంతో వైద్యంతో మెరుగైన వారికి పునరావాస కేంద్రం లేనందువల్ల చాలా నష్టం జరుగుతుందని, ప్రధానంగా మహిళలకు మరింతగా అన్యాయం జరుగుతుందన్న సామాజిక వాస్తవాన్ని కమీషన్ బయటపెట్టింది.

కుటుంబంలో పురుషుడికి వైద్యం చేయించడం కోసం తల్లి లేదా భార్య సంవత్సరాల తరబడి ఈ హాస్పిటల్‌లో చెట్లకింద వండుకొని తిని, వరండాలో ఏళ్ళ తరబడి ఎదురు చూస్తూ, బాగైతే ఇంటికి తీసుకెళ్తున్నారు. అదే స్త్రీల విషయంలో నిరాదరణ కొట్టొచ్చినట్లు కన్పిస్తోందనీ, ఒకవేళ బాగైనా ఆయా గ్రామాలలో, కొన్ని పట్టణాలలో కుటుంబాలు స్వీకరించక తిరిగి ఈ హాస్పిటల్‌కే పంపివేస్తున్న పరిస్థితిని కమీషన్ పరిశీలించి నమోదు చేసింది.

మానసిక వ్యాధుల్ని, వైద్య విజ్ఞానం లోతుల్లోకి మనం వెళ్ళి పరిశీలించనప్పటికీ, సమాజంలో అత్మహత్యల సంస్కృతి పెరగడానికి మానసిక దుర్బలత కారణమనీ, అది ప్రతి ఏటా పెరుగుతుందనీ ఎవరైనా చెప్పగలరు. నేడున్న ఆర్థిక, సామాజిక కారణాలు, సాంస్కృతిక కారణాలు, సాంకేతికత, తీవ్రమైన వత్తిడుల మధ్య సంక్షోభం పెరిగే కొద్దీ మనోవ్యాధుల్ని గుర్తించడం, వాటిని సరైన పద్ధతిలో నయం చేయడం ఒక వ్యక్తికి, ఒక కుటుంబానికి సాధ్యమయ్యే పనికాదు. ప్రభుత్వం సామాజిక బాధ్యతగా స్వీకరించాల్సిందేనన్నది కమీషన్ దృఢాభిప్రాయం.

మన విద్యావిధానంలో వచ్చిన మార్పులు, వయసుతో సంబంధం లేకుండా, ఎలాంటి విశ్రాంతీ లేకుండా శారీరక వ్యాయమం, ఉల్లాసం లేకుండా అన్నివర్గాల ప్రజలపై దోపిడీతో పాటు మానసిక, శారీరక హింసకూడా పెరుగుతున్నది. సామ్రాజ్యవాద, పెట్టుబడిదారీ లాభాపేక్ష మాత్రమే లక్ష్యంగా సాగుతున్న సమాజంలో, ఫ్యూడల్ సంస్కృతీ సాంప్రదాయాలు, సంకర సంస్కృతి మేళవించబడుతున్న మన దేశంలో స్త్రీలపైన, అణచబడ్డ వర్గాల ప్రజలపైన ఈ హింస ఎంతగా వుంటుందో ప్రత్యేకంగా చెప్పనక్కరలేదు. కమీషన్‌కి వివరించడానికికెళ్ళిన ప్రజాసంఘాల దృష్టిలోకి ఒక విద్యార్థి కేసు వచ్చింది. ఖమ్మం జిల్లా కొత్తగూడెం విద్యార్థికి ప్రభుత్వ స్కూల్లో 10వ తరగతిలో ఎక్కువ మార్కు లొచ్చాయని ఇంటర్‌లో చైతన్య కాలేజీలో చేర్చుకున్నారు. ఉచితమని తల్లిదండ్రులు అక్కడ చేర్పిస్తే 2 సంవత్సరాలలో పిచ్చివాడై ఇంటికొచ్చాడు. అతని కుటుంబాన్ని ప్రశ్నిస్తే అర్థమైన విషయాల్ని బట్టి ఈ వ్యవస్థ మానసిక రోగుల్ని ఎలా సృష్టిస్తుందో అర్థమవుతుంది. ఆ కాలేజిలోని విద్యార్థులందరూ దాదాపు అగ్రకులాల, ధనిక వర్గాలవారు కావడంతో పేదరికం నుండి వచ్చిన ఈ దళిత విద్యార్థి తమ పేదరికాన్ని ఎవరితో చెప్పుకోలేక ఆత్మన్యూనతకు గురై అక్కడి చదువుల ఒత్తిడికి తట్టుకోలేక ఈ మానసిక రుగ్మతకు గురయ్యాడన్నది వెల్లడవుతున్న వాస్తవం. సమాజం నిండా ఇలాంటి ఉదాహరణలు సవాలక్ష కన్పిస్తున్నాయి.

ఏ వ్యక్తికావ్యక్తిగా ఏకాకుల్ని చేస్తున్న ఈ వ్యవస్థీకృత హీన విలువలు, ఒక వ్యక్తి అనారోగ్యాన్ని, శారీరక, మానసిక ఆరోగ్యాన్ని డబ్బుతో కొలిచే పరిస్థితి వున్నప్పుడు, అది మరొకరితో చెప్పుకోలేక కుటుంబాలలో పడే ఒత్తిడి ఈ మానసిక వ్యాధుల్ని మరింత పెంచుతున్నది. ఆదరణ లేక, సహాయపడే వారు లేనప్పుడు, ఆ కుటుంబాలు మానవత్వాన్ని ఏ మాత్రం వదిలేసినా వాళ్ళంతా మనకు రోడ్లపైన కనిపిస్తారు. ఇలా రోడ్లపైన పిచ్చివాళ్ళుగా తిరుగుతున్న వాళ్ళ విషయాన్ని ఎర్రగడ్డ మానసిక వైద్యశాల డాక్టర్లు ఛాలెంజ్‌గా తీసుకొని ఒక వ్యక్తి కూడా రోడ్లపైన వుండనవసరం లేదని, ఇవాళున్న వైద్యరంగ విస్తరణ ప్రకారం, మందుల ప్రకారం అందరికీ నయం చేయవచ్చని రుజువు చెయ్యడానికి ముందు కొచ్చారు. తీవ్రమైన జబ్బుతో వున్న, బట్టలు కూడా లేకుండా తిరిగే మానసిక రోగిని తీసుకెళ్ళి వైద్యం చేసి తన పని తాను చేసుకొనేట్టుగా, హాస్పిటల్‌లో ఇతరులకు సహాయపడేట్టుగా ఆ పేషంట్‌ని మార్చగలిగారు. అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తే మరిన్ని ఫలితాలు సాధించగలుగుతామని డాక్టర్లు కమీషన్‌కి వివరించారు.

ప్రజారోగ్యాన్ని కేవలం కొందరు వ్యక్తుల వ్యక్తిగత విషయంగా చూడరాదని ప్రజారోగ్య మౌలిక సూత్రాలు పేర్కొంటున్నాయి. ఈ సమస్య దేశ ఉత్పాదకతతో, ఆర్థిక సామాజిక అంశాలతో ముడిపడినదనీ, ప్రభుత్వాలదే ప్రధాన బాధ్యతనీ సూచిస్తున్నాయి. వేలాది మందిని మానసిక వైకల్యం వైపు నడిపిస్తున్న అనేక రకాల రుగ్మతలు, వాటికి కారణాల్ని విశ్లేషించి సరైన విధంగా వైద్యం అందించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే. ఎర్రగడ్డ మానసిక వైద్యశాల వంటి వైద్యశాలల్ని రక్షించుకోవడం, అభివృద్ధి చేసుకోవడం-ప్రభుత్వ నిర్లక్ష్యంపై పోరాడి వైద్య, ఆరోగ్య సౌకర్యాలను సాధించుకోవడం నేటి అవసరం.

**- శ్రీహరి**

గత ఐదేళ్లుగా వచ్చిన రోగుల సంఖ్య

| సంవత్సరం | కొత్తవారు | | | తిరిగివచ్చిన వారు | | |
|---|---|---|---|---|---|---|
| | పురుషులు | మహిళలు | మొత్తం | పురుషులు | మహిళలు | మొత్తం |
| 2006 | 4591 | 2535 | 7126 | 63421 | 24898 | 88319 |
| 2007 | 4438 | 2538 | 6976 | 63289 | 37271 | 100560 |
| 2008 | 4447 | 2705 | 7152 | 73975 | 32550 | 106525 |
| 2009 | 4527 | 2693 | 7220 | 60133 | 43463 | 103596 |
| 2010 జూన్ వరకూ | 2960 | 1475 | 4435 | 24019 | 22301 | 46320 |

వెలువడింది!
సంకలనం-2010
(24 సంచికలు)
వెల. రూ 150/-
కాపీలకు : మైత్రీ బుక్ హౌస్
జలీల్ వీధి, అరండల్‌పేట,
విజయవాడ

# విద్యుత్ ఛార్జీల పెంపుకు నిరసన



బందరులో ధర్నా

**బందరు, 31-03-11 :**

రైతుకూలీసంఘం (ఆం.ప్ర.) ఆధ్వర్యంలో ఆస్తిపన్ను పెంపు, విద్యుత్ ఛార్జీలు పెంపు జీవోలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు రైతుకూలీ సంఘం (ఆం.ప్ర.) జిల్లా నాయకురాలు కా॥ పామర్తి అంజమ్మ, ఏపిఎఫ్‌టియు పట్టణ నాయకులు ముచ్చు సుధాకర్, ఎన్‌వైఎస్ పట్టణ నాయకులు వి. హన్మంత్ నాయకత్వం వహించారు.

49 రోజుల అసెంబ్లీలో కేవలం 53 గంటలు మాత్రమే పనిచేసిన వారికి (294 మందికి హాజరైంది కేవలం 168 మంది మాత్రమే) లక్షరూపాయల విలువచేసే ఉచిత బహుమతులు, జీతం ఎలవెన్స్‌లతో రూ॥ 95 వేలరూపాయలు అందుకున్నారనీ వారికి విద్యుత్ ఛార్జీలు పెరిగినా, ఆస్తిపన్ను పెరిగినా భారం కాకపోవచ్చుకానీ ప్రజలకు మాత్రము ఇవి శరాఘాతమేననీ, అసలే మండుతున్న ధరలతో, ముంపులతో, పంటలకు సరిపడా ధర రాక, రుణమాఫీ అందక చేనేత కార్మికుల ఆత్మహత్యలతో, ఫీజులు చెల్లించక విద్యార్థులూ అల్లాడుతుంటే ఈ పరిస్థితుల్లో ప్రజలపై పెనుభారం మోపడానికి జీవోలను తీసుకరావటం దారుణమనీ వెంటనే ఆ జీవోలను రద్దు చేయాలనీ ధర్నానుద్దేశించి ఈ సంఘాల నాయకులు ప్రసంగిస్తూ పేర్కొన్నారు.

పని చేసుకుందామంటే పనులు దొరక్క పంటలు వేస్తే గిట్టుబాటుధరలు రాక, కరిమింగిన వెలగపండు మాదిరి పథకాలు ప్రజలకు అందక, బలవంతపు భూ సేకరణతో భూములు కోల్పోయిన వారికి జీవించటానికి దారిలేక, ఆకాశాన్నంటిన ధరలను అందుకోలేక, డొక్కలెండిన సామాన్య ప్రజలపై పెనుభారం మోపడం దుర్మార్గమన్నారు. మౌలిక సమస్యల పరిష్కారానికి ఏమాత్రం శ్రద్ధ చూపని పాలకవర్గాలు, ప్రజల మెడలకు గుదిబండలాంటి జీవోలను తెస్తున్నారని, ప్రజలు ప్రజాతంత్రవాదులు ఐకమత్యంతో పోరాటాలు నిర్వహించాలని పిలుపు నిచ్చారు.

ఈ కార్యక్రమంలో కళాకారులు విప్లవ గేయాలను ఆలపించారు. ఏపిఎఫ్‌టియు రాష్ట్ర కార్యదర్శి యద్దనపూడి సోని, మచిలీపట్నంఆటోవర్కర్స్ యూనియన్ నాయకులు శాంతిబాబు, హేమకుమార్‌లు; రైతుకూలీసంఘం జిల్లా నాయకులు కె. ఉమామహేశ్వరరావు ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు.

**చంద్రర్లపాడు, 1-4-11:**

రాష్ట్రప్రభుత్వం పెంచిన విద్యుత్ ఛార్జీలను, సర్వీసు ఛార్జీలను ఉపసంహరించాలని, ఎడాపెడా సాగుతున్న విద్యుత్ కోతలను అరికట్టాలని, విద్యుత్‌రంగంలో ప్రైవేటీకరణను రద్దుచేసి ప్రభుత్వమే నిర్వహించాలని డిమాండ్‌చేస్తూ రైతుకూలీసంఘం ఆధ్వర్యంలో చంద్రర్లపాడు సెంటర్‌లో ధర్నా జరిగింది.

ఈ సందర్భంగా రైతుకూలీసంఘం(ఆం.ప్ర.) జిల్లా అధ్యక్షులు కా॥మందా జార్జి మాట్లాడుతూ-ఇప్పటికే అడ్డూ అదుపూ లేకుండా పెట్రోలు, డీజిల్ దగ్గరనుండీ అన్నిరకాల నిత్యావసర సరుకుల ధరలూ పెరిగి సామాన్య, మధ్యతరగతి ప్రజలు అల్లాడుతుంటే మూలిగే నక్కపై తాటికాయ పడ్డట్లు ప్రజలనెత్తిన విద్యుత్ ఛార్జీల పెంపును రుద్దారని అన్నారు. నేడు పాలకులు అభివృద్ధి పేరుతో చేబడుతున్న ప్రైవేటీకరణ విధానాల ఫలితంగా ప్రభుత్వరంగంలో ఉన్న అన్ని రకాల పరిశ్రమలను విద్యుత్-టెలికంలతో సహా అన్నింటినీ-ప్రైవేటీకరిస్తున్న ఫలితంగా లాభాలే ధ్యేయంగా పెట్టుబడిదారులు అన్నిరకాల ధరలనూ పెంచి, ప్రజలను నిలువునా దోచుకుంటున్నారని అన్నారు.

గతంలో విద్యుత్ ఛార్జీలను పెంచడంలేదని చెపుతూనే, 2 నెలలకు ఒకసారి చెల్లించే బిల్లులను ప్రతినెలా చెల్లించాల్సిన పద్ధతిని అమలుచేయటంతో కస్టమర్ ఛార్జీలు, విద్యుత్ సుంకాలు ప్రతినెలా చెల్లించాల్సిరావటంతో ఇది కనబడని భారం అయిందనీ ఇప్పుడు కూడా ఛార్జీలను పెంచడంలేదని చెపుతూనే ప్రతినెలా చెల్లించే కస్టమర్(సర్వీసు) ఛార్జీలను 10రూ॥నుంచి 25 రూ॥లవరకు అదనంగా పెంచారని- ఇది దొడ్డిదోవన ఛార్జీలను పెంచడంకాదా అని ప్రశ్నించారు. గతంలో 2 నెలలకు వచ్చే బిల్లులో సర్వీసు ఛార్జీ 15 రూ॥లుంటే నేడు పెరిగినదానిబట్టి చూస్తే 90 రూ॥లు అయిందని అంటే 75/-రూ॥లు అదనంగా పెంచారని అన్నారు. పంచాయితీ, మున్సిపాలిటీల్లో వీధి దీపాల ఛార్జీల భారాన్ని ప్రభుత్వం ప్రజలపై మోపుతున్నదని అన్నారు.

ప్రైవేటు దోపిడీకి కాపలాకాస్తున్న పాలకవర్గాలకు వ్యతిరేకంగా ప్రజలు ఐక్యంగా ఉద్యమించాలని అన్నారు.

ఈ కార్యక్రమంలో ఇంకా సంఘం జిల్లా నాయకులు కాసరెల్లి మస్తాన్, యాదల నాగేశ్వరరావు, అరిగెల కాంతయ్య, రాంబాబు, స్త్రీవిముక్తి సంఘటన జిల్లా కన్వీనర్ కామేశ్వరి, జిల్లా నాయకులు అవుదొడ్డి నాగమల్లేశ్వరి తదితరులు పాల్గొని నాయకత్వం వహించారు. ధర్నా అనంతరం ప్రదర్శనగా వెళ్ళి తహసిల్దార్‌కు మెమోరాండం అందజేశారు. ◈

# మునిసిపాలిటీ, కార్పోరేషన్లలో ప్రపంచబ్యాంక్ దుష్టపథకాలైన చెత్తపన్ను, ఆస్తిపన్ను, ట్రేడ్ పన్నుల విధింపుకు వ్యతిరేకంగా ఆందోళన

**పౌరులకు** అన్నిరకాల సదుపాయాలు కల్పించి పౌర సేవలను ఆదర్శవంతంగా, ఒక ప్రజాస్వామిక హక్కుగా పౌరులు అనుభవించే విధంగా, అది ఒక ముఖ్య కర్తవ్యంగా ప్రభుత్వాలు నిర్వహించాలి. కాగా, రానురాను పౌరులకు అందించాల్సిన సేవలకు, సదుపాయాలకు రేట్లు నిర్ణయించి వాటిని ప్రజల గోళ్ళూడగొట్టి వసూలు చేసే కాబూలీవాలాలుగా నేటి ప్రభుత్వాలు మారిపోయాయి. ఈ దుస్థితికి ముఖ్యకారణం నేటి పాలకవర్గాలు సామ్రాజ్యవాదులకు సేవకులుగా మారి, అమెరికన్ సామ్రాజ్యవాదుల ద్రవ్యసంస్థ ప్రపంచ బ్యాంక్ నిర్దేశిస్తున్న ఆర్థిక విధానాలను నిస్సిగ్గుగా అమలు పరచటమే! ప్రపంచదేశాల పోటీని తట్టుకొని నిలబడాలనే పేరుతో సరళీకరణ, ప్రవేటీకరణ, సామ్రాజ్యవాద ప్రపంచీకరణ విధానాలను ప్రజలపై నిరంకుశంగా రుద్దుతున్నారు. ఆ విధంగా ప్రజల హక్కులను వివిధ రూపాల్లో కాలరాచివేస్తున్నారు.

నగరాల అభివృద్ధి కోసమని ఏర్పాటు చేసిన జవహర్‌లాల్ నెహ్రూ జాతీయ నగర అధునీకరణ మిషన్ (JNNURM) పథకం రూపశిల్పి ప్రపంచబ్యాంకే. ఈ దుష్ట పథకం అమలులో భాగంగానే వివిధ నగరాలలో చెత్తపన్ను, ఆస్తిపన్ను, ట్రేడ్ పన్నులను వసూలు చేయటానికి ప్రభుత్వం జీవోలు జారీ చేసింది. ఈ అక్రమ జీవోలను రద్దు చేయాలని విజయవాడనగరంలో అఖిలపక్ష కమిటీ నాయకత్వాన ఆందోళన కొనసాగినా ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పందనా లేకపోవటంతో మార్చి 16వ తేదీన నగరబంద్‌కు అఖిలపక్ష కమిటీ పిలుపునిచ్చి నిర్వహించింది.

విజయవాడ నగరాన్నే పరిశీలిస్తే ప్రపంచబ్యాంక్ రూపొందించిన ఈ దుష్ట పథకాన్ని అమలు చేసేదాన్లో భాగంగా మొదటగా 2007 ప్రారంభంలో నగరంలో నీటి మీటర్లు బిగించే నిర్ణయాన్ని ప్రభుత్వం చేసింది. కాంగ్రెస్ మినహా మిగిలిన అన్ని పార్టీలూ 'నీటి మీటర్ల వ్యతిరేక ఐక్యపోరాట కమిటీ'గా ఏర్పడి వివిధ రూపాల్లో నిరవధిక ఆందోళన చేసిన ఫలితంగా ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకతప్పలేదు. తర్వాత 2007 చివరిలో జారీచేసిన ఆస్తిపన్నులను పెంచే 634, 635 జీవోలను రద్దుచేయాలని కోరుతూ పెద్దఎత్తున ఆందోళన సాగించిన ఫలితంగా పెంచిన ఆస్తిపన్నులను తగ్గించక తప్పలేదు. ప్రస్తుతం మరలా నగర ప్రజలపై భారాలు మోపడానికి చెత్తపన్ను, ఆస్తిపన్ను, ట్రేడ్ పన్నుల రూపంలో ప్రభుత్వం దుష్ట పథకాలతో ముందుకు వస్తున్నది.

ఈ దుష్ట పథకం క్రింద విజయవాడ నగరంలో నీటి సరఫరా, యుజిడి, ఎస్‌టిపి, సవరేజ్, సాలిడ్ వేస్టు మేనేజ్‌మెంట్, హౌసింగ్, బిఆర్‌టియస్ తదితర ప్రాజెక్టుల క్రింద రు. 1422.6 కోట్ల నిధులు మంజూరు చేస్తే ఇప్పటికి రు. 470.50 కోట్లు ఖర్చు చేసినట్లు కార్పోరేషన్ అధికారులు ప్రకటించారు. ఇందులో విజయవాడ నగరానికి ఏమాత్రం ఉపయోగపడని, కేవలం నిధులు రాబట్టుకోవటం కోసం నాడా దొరికింది కదా అని గుర్రాన్ని కొన్న చందంగా రు. 152 కోట్ల బిఆర్‌టిఎస్ (బస్ రాపిడ్ ట్రాన్స్‌పోర్టు సిస్టమ్) ప్రాజెక్టును చేపట్టారు. ఇప్పటికి రు. 470.50 కోట్లు ఖర్చు చేసినందుకు చెత్తపన్ను, ఆస్తిపన్ను, ట్రేడ్ పన్నులను నగర ప్రజలపై వేయాలని ప్రభుత్వం చూస్తున్నది. అంటే రాబోయే కాలంలో మొత్తంగా ప్రాజెక్టులు అమలు అయితే మరిన్ని భారాలను ప్రజలపై వేయటానికి ప్రభుత్వం పథకాలు రూపొందిస్తున్నదని తేటతెల్లమౌతోంది. ప్రపంచబ్యాంక్

(తరువాయి 7వ పేజీలో)

**లిబియా...** (3వ పేజీ తరువాయి)

ఒప్పందం చేసుకున్నాడు. ఇవికాక ఇటలీకి చెందిన ఎనీగ్యాస్, బ్రిటీషుగ్యాస్, ఫ్రాన్సుకు చెందిన టోటల్, హాలెండ్‌కు చెందిన రాయల్‌డచ్‌షెల్‌లు చమురు రంగంలో ప్రవేశించాయి. ఇవికాక చైనాకు చెందిన సిఎన్‌పిసి, ఇండోనేషియాకు చెందిన పెట్రామినా, నార్వేకు చెందిన నార్స్ హైడ్రో, భారత్‌కు చెందిన ఆయిల్ ఇండియాకు కూడా చమురు అన్వేషణకు అనుమతినిచ్చాడు. ఇక అమెరికాకు చెందిన ఎక్సాన్‌మొబిల్, ఆక్సిడెంటల్ పెట్రోలియం కంపెనీలు ఒప్పందాలు కుదుర్చు కున్నాయి.(బిబిసి న్యూస్, 10-3-2005).

ఆఫ్రికాలోకెల్లా ఎక్కువ చమురు నిక్షేపాలు(4500 కోట్ల బారెళ్ళు-ప్రపంచ వనరుల్లో 3.5 శాతం) లిబియాలో వున్నాయి. కీలకమైన ఈ సహజ వనరులపై ఆధిపత్యాన్ని సామ్రాజ్యవాదులు కోరుకుంటున్నారు. పెట్రోలియం వనరులున్న గల్ఫ్ దేశాలపై ఆధిపత్యం ఉన్న అమెరికా పెట్రోలియం వనరులులేని పశ్చిమ యూరపును తనపై ఆధారపడేలా చేసుకునేందుకు మిగిలిన వనరులను కూడా తన ఆధిపత్యం క్రిందకు తెచ్చుకునేందుకు పూనుకుంది. ఈ ఆధిపత్యాన్ని నిలబెట్టుకునేందుకు పెట్రోలియం వనరులున్న దేశాలపై రాజకీయ, సైనిక ఆధిపత్యం సాధించుకునేందుకు పూనుకుంటున్నది. అమెరికా సామ్రాజ్యవాదుల ఈ కాంక్షలను గడ్డాఫీ సంతృప్తపరిచే చర్యలు పూర్తిగా తీర్చలేదు. మూసివేసిన వీలర్ సైనిక స్థావరాన్ని తిరిగి తెరిచేందుకు గడ్డాఫీ ఆమోదించలేదు. ఈ స్థావరం అమెరికాకు మధ్యధరా సముద్రంపైనా, ఉత్తర ఆఫ్రికాపైనా సైనిక ఆధిపత్యాన్నిస్తుంది. వనరులపై ఆధిపత్యాన్ని కాపాడుకొనేందుకు అవసరమైన సైనిక ఆధిపత్య స్థాపనకొరకు ఈ ప్రాంతంపై రాజకీయ ఆధిపత్యాన్ని కోరుకుంటున్నది. దీనికోసమే గడ్డాఫీ ప్రభుత్వాన్ని గద్దె దించి, తన కనుసన్నల్లో నడిచే ప్రభుత్వాన్ని నెలకొల్పేందుకు పూనుకుంది. ఈ రాజకీయ ప్రయోజనాన్ని రాజకీయేతర సాధనంద్వారా సాధించేందుకు పూనుకుంది. దీని ఫలితమే దురాక్రమణ యుద్ధం.

## సామ్రాజ్యవాదుల మధ్య వైరుధ్యాలు

ప్రపంచాధిపత్యంకోసం అమెరికా అర్రులు చాచటంలో భాగంగా లిబియాపై సాగిస్తున్న దాడి సామ్రాజ్యవాదుల మధ్య వైరుధ్యాలను తీవ్రం చేసింది. సౌదీ రాజకుటుంబం, బహ్రెయిన్ షేకు కుటుంబ పాలనలు వీరికి నియంతృత్వంగా కన్పించలేదు. యెమెన్, కాతార్, ఒమన్, జోర్డాన్‌లో పాలకులు నిరంకుశులుగా వీరికి కన్పించలేదు. ప్రజాందోళనల తర్వాత అధికారంలోకి వచ్చిన ట్యునీషియా, ఈజిప్టు పాలకులు ప్రజలను తుపాకీ కాల్పులకెరచేస్తున్నా వీరికి నిరంకుశంగా కన్పించలేదు. ఈ అరబ్ దేశాలన్నింటా ప్రజాస్వామ్య సంస్కరణలకొరకు ఉద్యమిస్తున్న ప్రజలను అణచివేసేందుకు ఈ నిరంకుశ ప్రభుత్వాలకు వారన్నివిధాలా మద్దతునిస్తున్నారు. దీనిలో సామ్రాజ్యవాదులందరూ ఒక్కటే. వారి మధ్య వైరుధ్యాలు లేవు.

తమ దోపిడీ స్వప్రయోజనాలు వచ్చేసరికి వారిమధ్య వైరుధ్యాలు తలెత్తాయి. లిబియాలో కాలూని మొత్తం ఉత్తర ఆఫ్రికాపై పెత్తనం చెలాయించాలని అమెరికా పూనుకుంది. ఆఫ్రికాలో వలసపాలన సాగించిన ఫ్రాన్సు ఇప్పటికీ అక్కడ తనకున్న ఆధిపత్యానికి అమెరికా చర్యలను ప్రమాదంగా పరిగణిస్తున్నది. అమెరికా, ఫ్రాన్సు సామ్రాజ్యవాదుల మధ్య ఈ పోటీ-ఫ్రెంచి ప్రభావిత ప్రాంతాలను ఆధీనంలోకి తెచ్చుకునే అమెరికా చొరబాటు-ఆయా ఆఫ్రికా దేశాలను తన ప్రభావిత ప్రాంతంగా ఉంచుకునేందుకు ఫ్రాన్సు ప్రతి చర్యలు-20 ఏళ్లుగా కాంగోను రక్తసిక్తం చేస్తూనేవున్నాయి. ఫ్రాంకో ఫోన్ ఆఫ్రికానంతా (ఒకప్పటి ఫ్రాన్సు వలసపాలనలోని దేశాలు) వివిధ జాతులమధ్య భాతృహత్యా సదృశ్య మారణకాండకు ఆజ్యం పోస్తూనే వచ్చింది. సామ్రాజ్యవాదుల ఈ వైరుధ్యం వల్లనే నైజీరియాను విడగొట్టి బయాఫ్రాను ఏర్పాటు చెయ్యాలంటూ అమెరికా అంతర్యుద్ధాన్ని రెచ్చగొట్టింది. ఈ పోటీయే ఇటీవల సూడాన్‌ను-ఉత్తర, దక్షిణ సూడాన్‌లుగా విడగొట్టింది. చమురు వనరులున్న లిబియాలోని తూర్పుప్రాంతాన్ని విడగొట్టడానికి కూడా అమెరికా పూనుకుంటుంది.

ఫ్రాన్సుకు, అమెరికాకు మధ్య కీచులాటలకు మూలం ఈ దోపిడీ ఆధిపత్య ప్రయోజనాలే. లిబియాలో పరిణామాలు అమెరికాకు అనుకూలంగా సాగితే తన ఆధిపత్య ప్రయోజనాలు దెబ్బతింటాయని ఫ్రాన్సు భావిస్తున్నది. లిబియా పరిణామాలు తనకనుకూలంగా సాగాలని కోరుకుంటున్నది. దీనికోసమే లిబియాపై సాగుతున్న వైమానిక దాడులు తన నాయకత్వంలోనే జరగాలనీ, తద్వారా పరిణామాలను తనకనుకూలంగా మలుచుకోవచ్చునని ఇరుదేశాలూ కీచులాడు కుంటున్నాయి. ఫ్రాన్సు ఒకవైపునా, అమెరికా, బ్రిటన్, టర్కీలు మరోవైపునా చేరి సాగిన కీచులాట ఎంతకీ తెగక నాటో నాయకత్వంలోనే లిబియాపై దాడులు సాగాలని నిర్ణయించాయి. మార్చి 31 నుండి లిబియాపై దాడులలో పాల్గొంటున్న దేశాల సైన్యాలు నాటో కమాండులోకి వచ్చాయి.

ఈ నిర్ణయం పేరుకే మిగిలింది. నాటో ఆధీనంలో వుంచిన సైన్యాన్ని తగ్గిస్తున్నానని చెప్పి వాటిని నాటో ఆధీనంలో లేకుండా చేసి, తామే దాడి చేయటం. మళ్ళీ ఆ దళాన్ని నాటో ఆధీనంలోకి పంపుతుండటం సాగుతున్నది. ఏప్రిల్ 7న లిబియాపై దాడులు చేస్తున్న అమెరికా విమానాలలో 20 వెనక్కు తీసుకుంటున్నాననీ, మిగిలిన 11 విమానాలు దాడులు చేయవని, దాడిచేసే విమానాలకు సహాయం చేస్తామనీ అమెరికా ప్రకటించింది. దీనిపై గార్డియన్ పత్రిక ఇలా వ్యాఖ్యానించింది.

"ఎక్కువ సైనిక పాత్ర నిర్వహిస్తున్న అమెరికా, ఫ్రాన్సులు రెండూ తమ సైన్యాలను నాటో ఆధీనంలో వుంచటానికి నిరాకరిస్తున్నాయి. తమ ఆధీనంలోనే వుంచుకుంటున్నాయి....నాటో ఆధిపత్యంలో వుంటామని చెప్పినప్పుడు (లిబియాపై) వైమానిక దాడులు పూర్తిగా నాటో ఆధీనంలో సాగుతాయని ప్రకటించింది. అయితే ఈ దేశాలు నాటో ఆధీనంలోవుంటూ, బయటకు పోతూ, తమ దేశం చేసే దాడులకు తమ "ఆకాశ ఆస్తుల" (విమానాలను)ను వాడుతూ, తర్వాత మళ్ళీ నాటో కూటమి ఆధీనంలోకి వస్తూవున్నాయి".

తామేర్పరుచుకున్న సమిష్టి సంస్థ నాటో ఆధీనంలోనే వుంటామని ప్రకటిస్తాయి. కానీ వుండవు. ఎవరి స్వప్రయోజనాలకనుగుణంగా, దాడులు చేయటానికి నాటోనుండి బయటకు పోతాయి. ఆ పని పూర్తయిన తర్వాత నాటోలోకి వచ్చామంటాయి. సామ్రాజ్యవాదుల మధ్య పోటీ, కుమ్మక్కులనూ ఇది తెలుపుతుంది. వాటి స్వంత ప్రయోజనాలమధ్య పోటీ శాశ్వతమనీ, కుమ్మక్కు తాత్కాలికమనీ తెలుపుతుంది.

దోపిడీ ఆధిపత్యాల కొరకు సామ్రాజ్యవాదులమధ్య ఈ పోటీ లిబియాపై యుద్ధాన్ని త్వరగా ముగియనివ్వదు. మిగిలిన ఆఫ్రికా దేశాలలో సాగినట్లుగానే దీర్ఘకాలం రక్తపాతంతో సాగుతుంది. గడ్డాఫీ తొలగిపోవటంతో త్వరితగానే దాడులు ముగుస్తాయని సామ్రాజ్యవాదులు పదేపదే చెప్పటం ప్రపంచ ప్రజలను వంచించటానికే. దీర్ఘకాలిక యుద్ధానికి అవి సిద్ధపడివున్నాయి. తాత్కాలిక ఒప్పందాలు జరిగినా అవి నిలువవు. వాటి దోపిడీ ప్రయోజనాల మధ్య రాజీ కుదరదు. వారు లిబియాను ముక్కలు చేయటానికి కూడా వెనుకాడరు.

లిబియా భవిష్యత్తు ఇప్పుడు లిబియా ప్రజల చేతుల్లో వుంది. ◈

# షహీద్ భగత్‌సింగ్‌కు ఘన నివాళులు

**కరీంనగర్, 23-3-11:**

భగత్‌సింగ్ 80వ వర్ధంతి సందర్భంగా జిల్లా కేంద్రమైన కరీంనగర్‌లోని తెలంగాణా చౌక్‌నుండి నవయువ సమాఖ్య(ఎన్‌వైఎస్) ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం, భగత్‌నగర్ మీదుగా అంబేద్కర్ స్టేడియం దగ్గరవున్న భగత్‌సింగ్ విగ్రహం వరకు ప్రదర్శన నిర్వహించారు. భగత్‌సింగ్ విగ్రహానికి పూలమాలవేసి జోహార్లు అర్పించిన ఎన్‌వైఎస్ జిల్లా కార్యదర్శి కా॥బాముండ్ల రవి మాట్లాడుతూ 'పొద్దుపొడుపును సూచించే వేగుచుక్క భగత్‌సింగ్' అన్నారు. జాతీయోద్యమానికి సోషలిస్టు లక్ష్యాన్ని ప్రబోధించిన అగ్రగణ్యుడు భగత్‌సింగ్ అన్నారు. విప్లవం వర్ధిల్లాలి, సామ్రాజ్యవాదం నశించాలి, అన్న నినాదాలు ఇస్తూ వాటి ప్రాముఖ్యాన్ని దేశ ప్రజలకు వివరించిన భగత్‌సింగ్‌ను యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమములో ఇంకా నవయువ సమాఖ్య జిల్లా నాయకులు బి.ఆర్.శంకర్, సరోజ, శ్రీను, కుమార్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

**బెజ్జంకి, 23-3-11:**

షహీద్ భగత్‌సింగ్, రాజగురు, సుఖదేవ్‌ల వర్ధంతి సందర్భంగా నవయువసమాఖ్య(ఎన్‌వైఎస్) ఆధ్వర్యంలో బెజ్జంకి మండల కేంద్రంలో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌వైఎస్ జిల్లా కార్యదర్శి కా॥రవి మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చిందని చెప్పుకుంటున్న ఈ 64 ఏళ్ళ కాలంలో దేశ ప్రజల సమస్యలైన పేదరికం, నిరక్షరాస్యత, నిరుద్యోగం, ఆకలి చావులు, ఆత్మహత్యలు, అత్యాచారాలు పెరిగిపోయాయన్నారు. ఈ నేపథ్యంలో భగత్‌సింగ్ కోరుకున్న సమసమాజ స్థాపన కర్తవ్యం మిగిలేవుందని, యువతకు భగత్‌సింగ్ రచనలు, జీవితం ఎంతో ఆదర్శప్రాయమైనవని, దోపిడీని ప్రశ్నించిన భగత్‌సింగ్ గురించి నేటి తరానికి వాస్తవాలు తెలియనీయకుండా దోపిడీ పాలకవర్గాలు నిత్యం ప్రయత్నిస్తున్నాయనీ, ఈ దోపిడీ వర్గానికి వ్యతిరేకంగా పోరాటాలతో మార్గమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇంకా నవయువ సమాఖ్య జిల్లా నాయకులు బి.ఆర్.శంకర్, సరోజ తదితరులు పాల్గొన్నారు. ◈




విజయవాడసభలో ప్రసంగిస్తున్న కా॥ జస్వంతరావు; సభకు హాజరైన ప్రజానీకం



దేవిపట్నంలో ప్రదర్శన



శ్రీకాకుళం సభలో ప్రసంగిస్తున్న కా॥ వర్మ

## భూమి... (చివరి పేజీనుండి)

సిపిఐ(ఎం-ఎల్) రాష్ట్ర నాయకులు కామ్రేడ్ కె. కోటయ్య ప్రసంగిస్తూ వీరోచిత చల్లపల్లి జమిందారీ వ్యతిరేక పోరాటాన్ని గుర్తుచేసి, అమరులకు జోహార్లర్పించారు. దేశంలో పెరిగిపోతున్న అవినీతి, కుంభకోణాలను ప్రస్తావిస్తూ దీనికి మూలాలు ఈ వ్యవస్థలో వున్నాయన్నారు. ఊడలు దిగిన రాజకీయ అవినీతిని మూలాలనుండీ పెకిలించకుండా, పోరాడకుండా అవినీతి నిర్మూలన అసాధ్యమన్నారు. బహుళజాతి, సామ్రాజ్యవాద పరిశ్రమల చొరబాటు, కేంద్రీకరణ దేశంలో తీవ్రమౌతున్నదనీ, గనులు, అడవులు, భూమి, నీరు, సహజసంపదలు, సమస్తవనరులన్నింటినీ తరలించుకెళ్తున్నాయని, ఈ దోపిడీ రద్దు కోసం అమరుల స్ఫూర్తిగా పోరాటాలకు సంసిద్ధం కావాలంటూ కా॥ కోటయ్య ముగించారు.

ఏపిఎఫ్టియు రాష్ట్ర కార్యదర్శి కా॥ యద్దనపూడి సోని ప్రసంగంలో తొలుత అమరులకు నివాళు లర్పించారు. రాష్ట్రంలో ఆరునెలలపాటు భారీ వర్షాలకు పంటలు నష్టపోతే అసెంబ్లీలో కనీసపాటి చర్చ సాగించలేదనీ, మంత్రుల జీతభత్యాలను మాత్రం ఇబ్బడిముబ్బడిగా పెంచుకోవటంలో ఏకీభావంగా వున్నారనీ పేర్కొన్నారు. తీరప్రాంతాల్లో సాంప్రదాయక మత్స్యకారుల చేపల వేటను నిషిద్ధం చేస్తూ కార్పొరేటు సంస్థలను చేపలవేటకు అనుమతిస్తున్నారనీ, రైతాంగం, కార్మికులు, మత్స్యకారులు ఏకతాటిపైకొచ్చి పాలకుల ఈ విధానాలను ఎదుర్కోవాలన్నారు.

ఇంకా ఈ కార్యక్రమంలో రైతుకూలీ సంఘం (ఆం.ప్ర.) జిల్లా సహాయ కార్యదర్శి కా॥ యు. వీరబాబు, సంఘం జిల్లా కోశాధికారి కా॥ తలశిల లీలామనోహర్ పాల్గొని ప్రసంగించారు. ఈ సభకు చల్లపల్లి పరిసరగ్రామాల నుండి రైతులు, కూలీలు, శ్రామికులు దాదాపు 300 మంది హాజరయ్యారు. ప్రజాకళాకారుల పాటలు, బాలకళాకారుల 'సుద్దులు' ప్రజలను ఆకట్టుకున్నాయి.

### శ్రీకాకుళం, 7-4-11 :

భారత విప్లవోద్యమ అగ్రనేత, నక్సల్బరీ ఉద్యమ నిర్మాత కామ్రేడ్ కానూసన్యాల్ ప్రథమ వర్ధంతిసభ సిపిఐ(ఎం-ఎల్) ఆధ్వర్యంలో స్థానిక ప్రెస్‌క్లబ్‌లో జరిగింది.

ఈ సభకు రైతుకూలీసంఘం నాయకురాలు కా॥ టి. అరుణ అధ్యక్షత వహించి మాట్లాడుతూ కా॥ కానూసన్యాల్‌కు విప్లవ జోహార్లర్పించారు. సిపిఐ (ఎం-ఎల్) రాష్ట్రనాయకులు కా॥ సింహాద్రి ఝాన్సి మాట్లాడుతూ కా॥ కానూసన్యాల్ 81 సం॥లు జీవించారనీ, ఆయన 62 సం॥ల రాజకీయ జీవితం భారత విప్లవ గమనంలో అనేక ఒడిదుడుకులతో ముడిపడివుందన్నారు. 25 సం॥ల జైలు జీవితం, 15 సం॥ల రహస్య జీవితం గడిపారనీ కా॥ కానూసన్యాల్ ఎంతో సామాన్యమైన జీవన విధానంతో ఆదివాసీ పేద ప్రజానీకం మధ్యనే నివసించి, వారి మధ్యనే మరణించారన్నారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితులను విశ్లేషిస్తూ ఆంధ్రదేశంలో 70 థర్మల్ పవర్ ప్లాంటులు ఎందుకు పెడుతున్నారంటే సామ్రాజ్యవాద అనుకూల మౌలిక సదుపాయాల కోసమే అని స్పష్టం చేశారు. వేలాది ఎకరాల్ని కార్పోరేట్ సంస్థలకి ధారపోస్తున్నారనీ, ప్రజల అవసరాలకు నిలబడని ప్రభుత్వాలివి అని అన్నారు. భూస్వామ్య వర్గాలకి వారి దళారీలకీ, సామ్రాజ్య వాదులకీ ఈ ప్రభుత్వాలు ఊడిగం చేస్తున్నాయన్నారు. ఆవగింజంతైన దేశభక్తి లేని ఎంఎల్ఏలూ, మంత్రులు, నాయకులు దేశ సంపదల్ని సామ్రాజ్యవాదుల ఒడిలో పోస్తున్నారన్నారు. దీనికి పరిష్కారం చైతన్యవంతమైన ప్రజా ఉద్యమమేననీ, దానికోసం వేలాది నక్సల్బరీల్ని నిర్మించాలని కా॥ కానూదా ఆకాంక్షించారనీ, మార్క్సిజం, లెనినిజం సిద్ధాంత అవగాహనతో విప్లవ దృక్పథంతో ఉద్యమాలు నిర్మించడమే కా॥ కానూసన్యాల్‌కి నిజమైన నివాళి అన్నారు.

రైతుకూలీసంఘం రాష్ట్ర సహాయకార్యదర్శి కా॥ డి. వర్మ మాట్లాడుతూ భారత ప్రజల విముక్తికి ఉద్యమాల వేగుచుక్క కా॥ కానూసన్యాల్ అన్నారు. అతివాద, మితవాద ధోరణులతో అలుపెరగని పోరాటం చేసిన నాయకుడాయన అనీ, ఆయన జీవితం వృథాకారాదంటే ఆయనచూపిన ప్రజాయుద్ధ పోరాట పంథాలో భూస్వామ్య, పెట్టుబడిదారీ, సామ్రాజ్యవాద శక్తుల్ని తిప్పికొట్టాలన్నారు.

సిపిఐ(ఎం-ఎల్) రాష్ట్ర కమిటి సభ్యులు కా॥ పోతనపల్లి జయమ్మ మాట్లాడుతూ-ప్రభుత్వాలు ప్రజల ప్రయోజనాలకు నిలబడటం లేదన్నది స్పష్టంగా కనిపిస్తోందనీ ఈ తరుణంలో కా॥ కానూసన్యాల్‌వంటి నేతను కోల్పోవడం చాలా బాధాకరం అన్నారు. ఆయన చూపిన బాటలో ప్రజాపోరాటాలను నిర్మించాలని పిలుపునిచ్చారు.

భారతనాస్తిక సమాజం నుండి జగన్నాథరావు మాట్లాడుతూ సంపదకొందిమంది చేతుల్లో కాక, ప్రజలందరికీ చెందాలని కా॥ కానూసన్యాల్ తన జీవితాన్ని పోరాటానికి అంకితం చేసారన్నారు. సీనియర్ ఉపాధ్యాయ ఉద్యమ నాయకులు కా॥ బి. అప్పయ్య మాట్లాడుతూ ప్రజాయుద్ధ పోరాటనికి కా॥ కానూసన్యాల్ మార్గదర్శకంగా నిలిచారన్నారు.

జనసాహితి రాష్ట్ర అధ్యక్షులు కా॥ ఛాయరాజ్ మాట్లాడుతూ, శ్రామికవర్గ పక్షపాతంతో ప్రశ్నించి, ప్రజా ఉద్యమాల్ని నిర్మించి, నాయకత్వం వహించిన నాయకులు కా॥ కానూసన్యాల్ అన్నారు. ఈ సభలో అమరవీరుల త్యాగాల గురించి ప్రజాకళాకారులు పాడిన పాటలు ఆకట్టుకున్నాయి.

### పార్వతీపురం, 8-4-11 :

భారత విప్లవోద్యమ అగ్రనేత, నక్సల్బరీ ఉద్యమ నిర్మాత, ప్రజాయుద్ధ పంథా పోరాటయోధుడు కామ్రేడ్ కానూసన్యాల్ ప్రథమ వర్ధంతి సభ స్థానిక గిరిజన శ్రామిక నిలయంలో జరిగింది. ఈ సభలో మొదటగా రైతుకూలీసంఘం (ఆం.ప్ర.) రాష్ట్ర అధ్యక్షులు కా॥ సింహాద్రి ఝాన్సి మాట్లాడుతూ అధికార మార్పిడి జరిగి 64 సం॥ పూర్తయినా వ్యవసాయరంగం, పారిశ్రామిక రంగం రెండురంగాలూ రోజురోజుకూ కునారిల్లి పోతున్నాయని, అభివృద్ధి పేరుతో స్థాపిస్తున్నామంటున్న ఏ పరిశ్రమ కూడా ప్రజల జీవన విధానాన్ని పెంచేవిగా లేవని విమర్శించారు. మరొక ప్రక్క సహజ సంపదలను, వనరులన్నింటిని వినాశం చేసే వైపుగా ఈ చర్యలు వున్నాయని ఉద్ఘాటించారు.

ఉత్తరాంధ్రలో పెడుతున్న థర్మల్ విద్యుత్ కేంద్రాలన్నీ ప్రజల జీవితాలను నాశనం చేసే వైపుగా ఉండటంవలననే సోంపేట, కాకరాపల్లిలో ప్రజలు తిరగబడ్డారనీ. కోటిపాం, కొవ్వాడ అణువిద్యుత్ కేంద్రాలకు కూడా ఇదే స్థితి రాబోతున్నదనీ తెలియజేశారు.

దేశంలోను, రాష్ట్రంలోను అవినీతి, కుంభకోణాలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయనీ. వేలకోట్ల రూ॥ల 2జిస్పెక్ట్రం కుంభకోణం,ఆదర్శ్ హౌసింగ్ కుంభకోణం, కామన్‌వెల్త్ కుంభకోణాలు...ఇలా లెక్క పెడితే రోజుకొక్క కుంభకోణం బయట పడుతూనే ఉన్నాయని విమర్శించారు. అవినీతి కుంభకోణాలకు నిలయంగా భారతదేశం నిలిచివుందనీ, ఈ అవినీతికి వ్యతిరేకంగా పోరాటం చేయాలంటే ఈ దోపిడీవ్యవస్థతో పెనవేసుకున్న మూలాలను ప్రజాఉద్యమాల ద్వారా పెకలించగలగటం తప్ప మరొక్క మార్గంలేదని అన్నారు.

దున్నేవాడికే భూమి అనే నినాదంతో ప్రజలు పోరాటాల ద్వారానే సామ్రాజ్యవాదాన్ని, అవినీతిని దళారీల దోపిడిని పారద్రోలగలుగుతారని తెలియజేశారు. అపుడు మాత్రమే ప్రజల యొక్క మౌలిక సమస్యలు పరిష్కారమౌతాయని అన్నారు. మార్క్సిస్టు-లెనినిస్టు పార్టీ నాయకత్వంలో సంఘటిత ఉద్యమాలకు సమాయత్తం కావటమే కామ్రేడ్ కానూసన్యాల్‌కి అర్పించే నిజమైన నివాళని అన్నారు.

ఈ సభలో రైతుకూలీసంఘం (ఆం.ప్ర.) జిల్లా కార్యదర్శి కా॥ డి. వర్మ మాట్లాడుతూ కానూసన్యాల్ జీవితం ఎంతో ఆదర్శమైనదని, సుదీర్ఘ రాజకీయ జీవితం అంతా దోపిడీ, పీడనల్లేనటువంటి సమాజం కోసం చివర వరకూ పోరాటం సాగించారనీ, అతి, మితవాదాలకు వ్యతిరేకంగా నిబ్బరంగా నిలబడి ప్రజాయుద్ధపంథాలో ఉద్యమాన్ని నిర్మించారని, కానూ సన్యాల్ ఆశయాన్ని మనందరం కొనసాగించాలని పిలుపునిచ్చారు.

ఈ సభకు రైతుకూలీసంఘం (ఆం.ప్ర.) జిల్లా కోశాధికారి కా॥ పి. శ్రీను నాయుడు అధ్యక్షత వహించారు. రైతుకూలీ సంఘం (ఆం.ప్ర.) జిల్లా నాయకులు కామ్రేడ్స్ ఊయక ముత్యాలు, బొత్స నర్సింగరావు, మోనంగి భాస్కరరావు తదితరులు మాట్లాడారు. ఈ సభలో ప్రజాకళాకారులు పాడిన విప్లవ గీతాలు ప్రజల్ని ఆకట్టుకున్నాయి. మక్కువ, పార్వతీపురం, కొమరాడ, కురుపాం, బొబ్బిలి, సాలూరు. తదితర మండలాల నుండి 200 మంది రైతుకూలీలు ఈ సభకు హాజరైనారు.

### మక్కువ, 23-3-11:

విజయనగరంజిల్లా మక్కవ మండలం మూలవల్స గ్రామంలో నక్సల్‌బరీ నేత కామ్రేడ్ కానూసన్యాలు వర్ధంతి సభ జరిగింది. 200 మంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. రైతుకూలీసంఘం జిల్లా కార్యదర్శి కా॥ డి. వర్మ కానూసన్యాల్ చిత్రపటానికి పూలమాల వేసి జోహార్లు చెప్పారు.

కోటిపాం గ్రామంలో కానుసన్యాల్ వర్ధంతిసభ జరిగింది. రైతుకూలీ సంఘం (ఆం.ప్ర.) జిల్లా కోశాధికారి కా॥ పి. శ్రీనునాయుడు ఈ సభలో మాట్లాడారు.

### అనంతపురం, 10-4-11 :

నగ్జల్బరీ ఉద్యమ నిర్మాత, సిపిఐ(ఎం-ఎల్) ప్రముఖనేత కామ్రేడ్ కానూసన్యాల్ ప్రథమ వర్ధంతి సభ స్థానిక ఎన్‌జిఓ హాల్‌లో జరిగింది. ఈ వర్ధంతి సభకు సిపిఐ(ఎం-ఎల్) రాష్ట్ర నాయకులు కామ్రేడ్ సి.పెద్దన్న అధ్యక్షత వహించి, మొదటగా కా॥ కానూసన్యాల్‌కు ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా కా॥ పెద్దన్న మాట్లాడుతూ భారత విప్లవోద్యమానికి సరైన విప్లవపంథా రూపొందేందుకు అడ్డుపడిన పెడధోరణులన్నింటికీ వ్యతిరేకంగా పోరాడటంలోనూ, ప్రజాయుద్ధపంథాను ఆచరణలో చూపటంలోనూ కా॥ కానూసన్యాల్ ప్రాధాన్యత గొప్పదన్నారు. ఏపిఎఫ్టియు రాష్ట్ర కార్యదర్శి కా॥ వై. సోనీ మాట్లాడుతూ భారత ప్రజాతంత్ర విప్లవ విజయానికి రైతాంగం ప్రధాన శక్తిగా కార్మిక వర్గం నాయకత్వం వహించాలన్న సిద్ధాంత అవగాహనను కా॥ కానూసన్యాల్ నగ్జల్బరీ పోరాటంలో ఆచరణలో పెట్టారన్నారు. టి.ఎన్. మెమోరియల్ ట్రస్టు అధ్యక్షులు కామ్రేడ్ బి. సూర్యసాగర్ ప్రసంగిస్తూ కామ్రేడ్ కానూసన్యాల్ విప్లవాత్మకమైన ఆచరణ, నిరాడంబర జీవనం, ఎన్నోరకాల రాజకీయ ఆటుపోట్ల మధ్య; దూషణలు, నిందారోపణల మధ్య కూడా జంకకుండా విప్లవపంథాకు కట్టుబడి చివరికంటా కొనసాగటామనే దాంట్లో కామ్రేడ్ కె.యస్., కామ్రేడ్ టి.యన్‌లలో సామ్యముందన్నారు. అతి, మితవాద అవకాశవాదాలకు వ్యతిరేకంగానూ, రాజ్యహింసకు వ్యతిరేకంగానూ, పాలకుల ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగానూ కామ్రేడ్ కానూసన్యాల్ అనర్గళమైన తన వాగ్ధాటితో, నిశితమైన తన విమర్శనాస్త్రాలతో ప్రజాభిమానాన్ని చూరగొన్న నాయకుడని కా॥ సూర్యసాగర్ కొనియాడారు. ఇంకా ఈ సభలో రైతుకూలీసంఘం (ఆం.ప్ర.) జిల్లా కార్యదర్శి కామ్రేడ్ టి. తిమ్మారెడ్డి, స్త్రీ విముక్తి సంఘటన జిల్లా కార్యదర్శి కా॥ ఎన్. భూదేవి ప్రసంగించారు. ఈ సభకు 300 మంది రైతుకూలీ, శ్రామిక స్త్రీ పురుషులు హాజరయ్యారు. ప్రజాకళాకారులు అమరవీరులపై పాడిన పాటలు సభికులలో స్ఫూర్తిని నింపాయి. ◈

## లిబియాపై అమెరికా సైనిక కూటమి దాడులను ఖండిస్తూ ప్రదర్శన, దిష్టిబొమ్మ దగ్ధం



ఒంగోలులో దిష్టిబొమ్మ దగ్ధం

### ఒంగోలు, 3-04-11 :

అమెరికా, పశ్చిమ యూరపు సామ్రాజ్యవాదులు లిబియాలోని ఆయిల్ మరియు గ్యాస్ నిక్షేపాలను దోచుకునేందుకు సాగిస్తున్న దురాక్రమణ సైనిక దాడిని ఖండిస్తూ, వెంటనే అమెరికా సైనిక కూటమి సైన్యాలు వెనుతిరగాలని డిమాండుచేస్తూ సిపిఐ(ఎం-ఎల్) ప్రకాశం జిల్లా శాఖ ఆధ్వర్యంలో స్థానిక ఈమనిపాలెం పార్టీ కార్యాలయం నుండి అమెరికా సైనిక కూటమి దిష్టిబొమ్మతో మున్సిపల్ ఆఫీసు, కలక్టరేట్, నెల్లూరు బస్టాండు మీదుగా చర్చిసెంటరు వరకు ప్రదర్శన నిర్వహించి అనంతరం దిష్టిబొమ్మ దగ్ధం చేశారు.

ఈ సందర్భంగా సిపిఐ(ఎం-ఎల్) జిల్లా నాయకులు కా॥ ఎస్. లలితకుమారి మాట్లాడుతూ 66 లక్షల జనాభా కలిగి, ఆయిలు, గ్యాస్ నిక్షేపాలు అధికంగా కలిగిన చిన్నదేశం లిబియా అనీ, గత దశాబ్ది కాలంలో అక్కడి గడాఫి ప్రభుత్వం అమలు పరచిన సరళీకృత ఆర్థిక విధానాల ఫలితంగా ప్రజలు తీవ్ర సంక్షోభంలోకి కూరుకుపోయి ప్రభుత్వ వ్యతిరేక ఆందోళనలు సాగిస్తున్నారని, దీనిని ఆసరాగా తీసుకొని అమెరికా నాయకత్వంలోని నాటో కూటమి ఆయిల్ వనరులపై, గ్యాస్ పై పట్టుకోసం, ఆ నిక్షేపాలను దోచుకోవాలని లిబియాపై సైనిక దాడులు జరుపుతూ వందల మందిని పొట్టనపెట్టుకుంటున్నదన్నారు. ఈ సామ్రాజ్యవాదుల దురాక్రమణ దాడులను సిపిఐ(ఎం-ఎల్) తీవ్రంగా ఖండిస్తున్నదనీ, లిబియాను ఎవరు పరిపాలిస్తారనే సమస్య లిబియా ప్రజలు పరిష్కరించుకోవాల్సిన సమస్య అనీ, సామ్రాజ్యవాదులు ఏ రూపంలోనూ లిబియా ఆంతరంగిక విషయాలలో జోక్యం చేసుకొనే హక్కు లేదనీ, వెంటనే అమెరికా సైనిక కూటమి సైన్యాలు వెనుతిరగాలనీ, ప్రజలు, ప్రజాతంత్రవాదులు, అన్ని దేశాలు ఈ దాడులను ఖండించాలనీ పిలుపు నిచ్చారు.

ఈ కార్యక్రమంలో ఏపిఎఫ్టియు జిల్లా కార్యదర్శి కా॥ ఎం.ఎస్. శాయి, రైతుకూలీ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పరిటాల కోటేశ్వరరావు, జిల్లా అధ్యక్షులు కా॥ వేజెండ్ల రామారావు, స్త్రీవిముక్తి సంఘటన జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కామ్రేడ్స్ టి. రేణుక, పి. శాంతకుమారి, ఏపిఎఫ్టియు జిల్లా నాయకులు కా॥ హనుమంతరావు, ఎన్‌వైఎస్ నాయకులు కా॥ బి. సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు. ◈

---

## మునిసిపాలిటీ, ... (6వ పేజీ తరువాయి)

రూపొందించిన పథకాలయొక్క అసలు ప్రమాదకర స్వరూపం ఇదే. గతంలో చంద్రబాబునాయుడు ప్రభుత్వ కాలంలో విద్యుత్ ఛార్జీల పెంపుదలపై పెద్దఎత్తున జరిగిన ప్రజాఆందోళన ప్రపంచబ్యాంక్‌తో చేసుకొన్న ఒప్పందాల కారణంగానే ముందుకొచ్చిందనేది వాస్తవం.

కావున ప్రజలపై ముఖ్యంగా పేద, మధ్యతరగతి వర్గం ప్రజలపై ప్రపంచబ్యాంక్ రూపొందించిన దుష్టపథకాల ఫలితంగా పడబోతున్న భారాలకు వ్యతిరేకంగా ప్రజలు సమైక్యపోరాటం సాగించాలి. గతంలో నీటిమీటర్లు, ఆస్తిపన్నులకు వ్యతిరేకంగా సాగించిన ఆందోళనలు అందించిన అనుభవాల వెలుగులో ముందుకు సాగాలి. చెత్తపన్ను, ఆస్తిపన్ను, ట్రేడ్‌పన్నులు రద్దు అయ్యే వరకు సంఘటిత పోరాటం సాగించాలి. అలానే నానాటికీ ప్రజలపై పన్నుల భారాన్ని పెంచటానికి మూలకారణమైన ప్రపంచబ్యాంక్ ఆధిపత్య, విధానాల రద్దుకోసం సాగే పోరాటాలలో వివిధ మున్సిపాలిటీలు, కార్పోరేషన్లలో సాగే ఈ పోరాటాలు భాగం కావాలి. ◈

# ‘భూమి సమస్య కీలకంగా, సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటం సాగించాలి’

## కానూసన్యాల్ ప్రధమ వర్ధంతి సభలలో వక్తల పిలుపు

*భారత విప్లవోద్యమ అగ్రనేత, సిపిఐ(ఎం-ఎల్) ప్రముఖ నాయకులు కా॥ కానూసన్యాల్ మనల్ని వీడి మార్చి 23కి సంవత్సరం గడిచింది. కా॥ కానూసన్యాల్ ప్రధమ వర్ధంతి సభలను జరపమని సిపిఐ (ఎం-ఎల్) కేంద్రకమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగా పార్టీ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో హైదరాబాదులోనూ; ఒంగోలు, పిడుగురాళ్ళ, రేపల్లె, మంగళగిరిలలో జరిగిన వర్ధంతి సభల రిపోర్టులను గత సంచికలో ప్రచురించాము. మరికొన్ని కేంద్రాలలో జరిగిన వర్ధంతి సభల రిపోర్టులను అందిస్తున్నాం.*

*- సంపాదకుడు*

**విజయవాడ, 27-03-11:**

పీడిత ప్రజల ప్రియతమ నాయకుడు, నక్సల్‌బరీ ఉద్యమ నిర్మాత, అతివాద, మితవాద విధానాలపై రాజీలేని పోరాటం సాగించిన కా॥ కానూసన్యాల్ ప్రధమ వర్ధంతి సభ స్థానిక స్వాతంత్ర్య సమరయోధుల భవనంలో జరిగింది. విజయవాడ నగరంలోని కమ్యూనిస్టు ఉద్యమ శ్రేణులు, అభిమానులు, శ్రేయోభిలాషులు హాజరైన ఈ సభా ప్రారంభంలో కా॥ కె.యస్.ను స్మరిస్తూ మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. కా॥ కానూసన్యాల్ చిత్రపటానికి పార్టీ కేంద్రకమిటీ నాయకులు కా॥ జస్వంతరావు పూలమాల వేసి రెడ్ శాల్యూట్ చెప్పారు.

సభకు అధ్యక్షత వహించిన పార్టీ జిల్లా కార్యదర్శి కా॥ ముప్పాళ్ళ భార్గవశ్రీ తొలుత కా॥ కానుసన్యాల్ విప్లవకర జీవితాన్ని వివరిస్తూ తెలంగాణా రైతాంగ సాయుధ పోరాటం తర్వాత సాపేక్షంగా దీర్ఘకాలం నిస్తబ్దంగా వున్న కమ్యూనిస్టు ఉద్యమ స్థితిలో ‘వసంతకాల మేఘఘర్జన’గా కుదిపేసిన, నక్సల్‌బరీ ఉద్యమ నిర్మాతగా వెలుగొందిన, అదే సమయంలో చారుమజుందార్ అతివాద దుందుడుకు విధానాలపై అలుపెరగని పోరాటం చేసిన కా॥ కానుసన్యాల్ విప్లవకర జీవతం ఎంతో ఆదర్శప్రాయమైనదన్నారు. మహత్తర విప్లవకర జీవితాన్ని గడిపిన కా॥ కానుసన్యాల్ కలలుగన్న సోషలిస్టు వ్యవస్థను సాధించడానికి ప్రతినబూనుదామన్నారు.

పార్టీ కేంద్ర కమిటీ నాయకులు కా॥ పి. జస్వంతరావు ప్రసంగిస్తూ, కమ్యూనిస్టు ఉద్యమాన్ని అతి, మితవాద ధోరణులు పట్టిపీడిస్తున్నాయనీ, తెలంగాణా రైతాంగ సాయుధ పోరాటం ప్రజాపంథాలో సాగుతున్న కాలంలో బి.టి.రణదివే కంటికికన్ను-పంటికిపన్ను అన్న పంథా పార్టీని ఎలా చిన్నాభిన్నం చేసిందో చూశామన్నారు. కమ్యూనిస్టు ఉద్యమాన్ని ఒక మలుపు తిప్పిన నక్సల్‌బరీ ఉద్యమాన్ని రెండునెలలు తిరగక ముందే అతివాద విధానం పైచేయి సాధించి నష్టం కల్గించిందన్నారు. భూమి సమస్యప్రధానమైన నక్సల్‌బరీ లాంటి ఉద్యమాలు అనేకం రావాలనీ, తెలంగాణా సాయుధ పోరాటానికి దారి తీసింది చాకలి ఐలమ్మ భూ సమస్యేనని, నందిగ్రామ్‌లో భూమి సమస్య కోసం రైతులు సంఘటితంగా నిలబడ్డారని, కానుసన్యాల్ ఆ పోరాటంలో స్వయంగా పాల్గొన్నారని, అర్థవలస, అర్ధఫ్యూడల్ వ్యవస్థగా వున్న మన దేశంలో భూమి సమస్యను ప్రధానంగా చేసుకోకపోతే సామ్రాజ్యవాదాన్ని ఎదుర్కోవటం కష్టం అనీ, ఇందుకు తెలంగాణా, నక్సల్‌బరీ పోరాటాలు ఆదర్శంగా నిలుస్తాయనీ, ప్రపంచీకరణ విధానాలలో అంతర్భాగమే పోస్టు మోడర్న్ విధానాలనీ, నేడు అరబ్ దేశాలలో జరుగుతున్న పోరాటాల ఫలితంగా నియంతలు గద్దెదిగుతున్నా నియంతృత్వం పోవటం లేదని, ప్రజల్ని సరైన దిశలో నడపగల్గిన నాయకత్వాలు కావాలని, భూస్వామ్య విధానానికి గోరీ కట్టే విధంగా ప్రజల్ని పోరాటాలకి సన్నద్ధం చేయాలని పిలుపు నిచ్చారు.

సమతామార్గ్ నాయకులు వాసిరెడ్డి కృష్ణారావు మాట్లాడుతూ ‘సబ్‌కాబరీ నక్సల్‌బరీ’ అన్న నినాదం దేశ వ్యాపితంగా ఎంతో ప్రభావాన్ని పడవేసిందని, భూమికోసం ఆదివాసీ రైతాంగం నాయకత్వం వహించగలరని నక్సల్‌బరీ పోరాటం తేటతెల్లం చేసిందనీ, అంతేకాక విప్లవ దశను, విప్లవ కార్యక్రమాన్ని ముందుకు తెచ్చిందనీ, సిద్ధాంతం-ఆచరణలను రెంటినీ జోడించి ఏ విధంగా ఉద్యమాలు సాగుతాయో నిరూపించిందనీ, కానుసన్యాల్ లాంటి మహోన్నత నాయకుడిని అలాంటి ఉద్యమాలు అందించాయనీ, ఈనాటి యువతరం అలాంటి నాయకులను ఆదర్శంగా తీసుకోవాలని చెప్పారు.

సోషల్ సైన్స్ ట్రస్టు బాధ్యులు చలసాని రాధాకృష్ణదాస్ మాట్లాడుతూ, ‘ఎంతో నిరాడంబర జీవితం గడిపిన కానుసన్యాల్‌కి జోహార్లు చెబుతున్నాను. ఆయన 18 సం॥లు జైలు జీవితం గడపడం, రహస్య జీవితం ఎక్కువ కాలం గడపడం నిజంగా ఆశ్చర్యం కల్గించే విషయాలు. కానుసన్యాల్ రైతుల భూమిసమస్యపై పోరాడారు, ఆయన చారుమజుందార్ పాలసీని వ్యతిరేకించి నిలబడ్డారు, ప్రజల్ని ఆర్గనైజ్ చేయటానికి ప్రాధాన్య నివ్వాలని చెప్పార’న్నారు.

సి.పి.ఐ(ఎం.ఎల్) రాష్ట్ర నాయకులు కా॥ కోటయ్య మాట్లాడుతూ చారుమజుందార్ అతివాద పంథాపై కానుసన్యాల్ సాగించిన పోరాటం విలువైన అనుభవాలు అందించిందనీ, డైరెక్టర్లు యాక్టర్లు కాకూడదనీ, అతివాదులు అనుసరిస్తున్న ఆచరణ ప్రజా ఉద్యమాలు అభివృద్ధికాకుండా అడ్డుపడ్తున్నదనీ, సి.ఎమ్. అతివాద తుఫాన్ తమ తలల మీదుగా వెళ్ళి ఎంతో నష్టం కల్గించిందనీ, ప్రజల్ని ప్రేక్షకులను చేసే అతివాద, మితవాద విధానాలకు వ్యతిరేకంగా ప్రజాయుద్ధపంథాలో ముందుకు సాగటమే కా॥ కానుసన్యాల్‌కి నిజమైన నివాళి అని చెప్పి ముగించారు.

సభా ప్రాంగణంలో కా॥ కానుసన్యాల్ అంతిమయాత్ర ఫోటోలతోపాటు ఆయన పాల్గొన్న వివిధ సందర్భాలను జ్ఞప్తికితెచ్చే ఫోటోల ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ ప్రదర్శనను చూసిన సభికులు తమ జ్ఞాపకాలను నెమరువేసుకొన్నారు.

**దేవీపట్నం, 31-03-11 :**

తూర్పుగోదావరిజిల్లా, మండల కేంద్రమైన దేవీపట్నంలో కామ్రేడ్ కానూసన్యాల్ ప్రధమ వర్ధంతి; తూర్పుగోదావరిజిల్లా గిరిజన రైతాంగ పోరాట యోధుడు కామ్రేడ్ సోమయ్యల 20వ వర్ధంతిని పురస్కరించుకొని అమర వీరులకు జోహార్లు చెపుతూ 400 మంది గిరిజన, గిరిజనేతర పేదలు ప్రదర్శన నిర్వహించారు.

అనంతరం నిర్వహించిన బహిరంగసభకు ఏజన్సీ గిరిజన సంఘం నాయకులు కా॥ చెదల వీరపురెడ్డి అధ్యక్షత వహించారు. తొలుత సిపిఐ(ఎం-ఎల్) రాష్ట్ర నాయకులు కా॥ సింహాద్రి ఝాన్సి మాట్లాడుతూ కామ్రేడ్ కానూసన్యాల్ తన సుదీర్ఘ రాజకీయ జీవితంలో గిరిజనులు, రైతులు, కార్మికులను సంఘటితపరిచి, ఆందోళనల్లోకి సమీకరించే కృషిలో నిమగ్నమయ్యారన్నారు. జోతేదార్ల ఆక్రమణలోని భూమిస్వాధీనానికై ‘దున్నేవానికే భూమి’ నినాదంతో, పోరాటం నడిపారన్నారు. పేదవాడిని దోచుకొని వందల, వేల ఎకరాలు భూస్వాములకు కట్టబెట్టే ఈ దోపిడీ వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాటం తప్ప మరో పరిష్కార మార్గం లేదని 67లో నగ్జల్బరీ ఉద్యమానికి నాయకత్వం వహించిన కా॥ కానూసన్యాల్ చాటి చెప్పారన్నారు. కా॥ కానూసన్యాల్ త్యాగం, ఆ ఒరవడి ఆదర్శనీయమనీ, ఆ ఒరవడిలో పనిచేయటమే కా॥ కానూదాకు అర్పించే నివాళి అన్నారు.

1967-68 సం॥లలో తూర్పుగోదావరిజిల్లా కొండమొదలులో గిరిజనుల భూమి సమస్య, నాగువడ్డీ దోపిడీ, పాలేర్ల సమస్యలపై పోరాటం కొనసాగి భూస్వాముల భూములను స్వాధీనం చేసుకొనే దశకు చేరిందనీ, అంతిమంగా గిరిజనులు భూములు దక్కించుకోగలగారన్నారు. ఈ ప్రాంతం ప్రజలలో మమేకమైన కామ్రేడ్ సోమయ్య విప్లవకర జీవితం మార్గదర్శకమైనదన్నారు. ఈనాడు గిరిజన ప్రజానీకం ఏమేరకైనా హక్కులను సాధించుకున్నారంటే వాటి వెనుక కామ్రేడ్స్ కుంజం రాజులు, మడెం లక్ష్మయ్యల అమరత్వం; కా॥ సోమయ్య వంటి వారెందరిదో త్యాగపూరిత కృషివున్నదనే విషయాన్ని విస్మరించరాదన్నారు. ఈనాడు మైదాన ప్రాంత భూములే కాక, అడవులు, కొండలు, ‘కాదేదీ కట్టబెట్టేందుకు అనర్హమన్న’ రీతిలో దళారీ పాలకులు కార్పోరేట్ సంస్థలకు ధారాదత్తం చేస్తున్నారన్నారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా పోరాటాలు సాగించటమే అమరులకు అర్పించే నివాళిగా కా॥ ఝాన్సి పేర్కొన్నారు.

రైతుకూలీసంఘం (ఆం.ప్ర.) రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కామ్రేడ్ ఎం.ఎస్. నాగరాజు మాట్లాడుతూ నగ్జల్బరీ గిరిజన రైతాంగ పోరాటం ముందుకొచ్చిన క్రమంలోనే ఆంధ్రకమిటి విప్లవ కారులు - ‘పోరాట ఉద్యమానికి పునాదులు వేయండి’ డాక్యుమెంట్ ఆధారంగా రాష్ట్రంలో శ్రీకాకుళం, ఖమ్మం, వరంగల్, తూర్పుగోదావరి ఏజన్సీ ప్రాంతాల్లో కేంద్రీకరించి ఉద్యమ నిర్మాణ కృషి సాగించారన్నారు. ఈ ఆచరణలో భాగంగా కొండమొదలు ప్రాంతంలో నిర్మించిన ఉద్యమ క్రమంలో కా॥ సోమయ్య ఒక ముఖ్యమైన పాత్ర నిర్వహించారన్నారు.

పోలవరం ప్రాంతంలో కామ్రేడ్ కారం పార్వతి, పార్వతీపురం ఏజన్సీ ప్రాంతంలో కామ్రేడ్ జెన్ని తిరుపతి భూస్వామ్య వ్యతిరేక పోరాటంలో అమరులయ్యా రన్నారు. కామ్రేడ్ కానూసన్యాల్ పోలవరం, పార్వతీపురంలో సాగిన పోరాటాలను కొనియాడారన్నారు. రైతుకూలీసంఘం నాయకత్వంలో పోలవరం ప్రాజెక్టు వ్యతిరేక ఆందోళనలో భూమికి భూమి, అడవికి అడవి, శాస్త్రీయ పునరావాసం ఎజెండాపైకి తెచ్చి ఆదివాసీ రైతాంగ ప్రజానీకాన్ని కదిలించామన్నారు. అమరులకు నివాళులర్పిస్తూ వారు చూపిన మార్గదర్శకత్వంలో ముందుకు సాగుదామంటూ కామ్రేడ్ నాగరాజు తన ప్రసంగం ముగించారు. ఇంకా ఈ సభలో ఏజన్సీ గిరిజన సంఘం తూర్పుగోదావరిజిల్లా కార్యదర్శి కామ్రేడ్ గంగరాజు; పశ్చిమ గోదావరి జిల్లా కార్యదర్శి కామ్రేడ్ కుంజం రామారావు అమరులకు నివాళులర్పిస్తూ మాట్లాడారు. ప్రజాకళాకారులు అమరవీరులపై స్ఫూర్తిదాయకంగా పాటలు పాడారు.

**చల్లపల్లి, 4-04-11 :**

సిపిఐ(ఎం-ఎల్) ఆధ్వర్యంలో కా॥ కానూసన్యాల్ ప్రధమ వర్ధంతిసభ కృష్ణాజిల్లా మండల కేంద్రమైన చల్లపల్లిలో జరిగింది. సభ ప్రారంభానికి ముందుగా 150 మంది రైతు, కూలీలు ఎర్రజెండాలు చేబూని, అమరులకు జోహార్లు చెబుతూ ప్రదర్శనగా చల్లపల్లి వైన్స్ కాంప్లెక్స్ నుండి బయలుదేరి నాగాయలంక రోడ్డు, పోలీసు స్టేషన్ రోడ్ గుండా తిరిగి వైన్స్ కాంప్లెక్స్ వద్ద ఏర్పరచిన బహిరంగసభావేదిక వద్దకు చేరుకున్నారు. పార్టీ జిల్లా నాయకులు కామ్రేడ్ జె. జగన్ అధ్యక్షతన జరిగిన ఈ సభలో తొలుత సిపిఐ(ఎం-ఎల్ ) కేంద్ర నాయకులు కామ్రేడ్ పి. జస్వంతరావు ప్రసంగించారు. తెలంగాణా రైతాంగ సాయుధపోరాట విరమణ అనంతరం దాదాపు రెండు దశాబ్దాల కాలపు నిస్తబ్ధతను బ్రద్దలుకొడుతూ నగ్జల్బరీ పోరాటం ముందుకొచ్చిందనీ దున్నేవానికే భూమి నినాదాన్ని, వ్యవసాయక విప్లవ ప్రాధాన్యాన్నీ, ప్రజాయుద్ధపంథా ఆవశ్యకతనూ మరో మారు రంగం మీదకు తీసుకువచ్చిందనీ నగ్జల్బరీ పోరాట ప్రాధాన్యతను వివరించారు.

ప్రస్తుత భారతదేశ పరిస్థితులను విశ్లేషిస్తూ గత 5 సం॥ల కాలంలోనే దేశ వ్యాపితంగా 3 లక్షల మందిపైగా రైతాంగం ఆత్మహత్యలు చేసుకున్నారనీ, రైతాంగాన్ని దివాలాతీయించే పాలకుల విధానాలే దీనికి కారణమన్నారు. సాంప్రదాయక, ఆహార పంటలను నాశనంచేసి బహుళజాతి, కార్పొరేటు పరిశ్రమలకు ముడిసరుకును సరఫరా చేసే పంటలను ప్రోత్సహిస్తున్నారన్నారు. రైతాంగానికి కల్పించే సబ్సిడీలన్నింటినీ రద్దు చేస్తూ వ్యవసాయ ఖర్చులను ఒకవైపు మోయలేని భారంచేస్తూ మరో వైపున పండిన పంటలకు కనీస గిట్టుబాటు ధరలను కూడా కల్పించటంలేదన్నారు. ఈ పరిస్థితుల్లో ప్రజాపోరాటాలు తీవ్రంచేయాలని, సాగించే పోరాటాలను భూస్వామ్య, సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటాలలో భాగం చేయాలని కా॥ జస్వంతరావు పిలుపునిచ్చారు.

(తరువాయి 7వ పేజీలో)


చల్లపల్లిసభలో ప్రసంగిస్తున్న కా॥ జస్వంతరావు



దేవీపట్నంసభలో ప్రసంగిస్తున్న కా॥ ఝూని


అనంతపురంసభలో ప్రసంగిస్తున్న కా॥ పెద్దన్న

Printed, Published and Owned by P.Jaswantha Rao 32-13-26/1, B.M.Rao Road, Moghalrajapuram, Vijayawada-520 010
and Printed at Chaitanya Printers, Gora Veedhi, Suryaraopet Vijayawada-2
Editor: P. Jaswantha Rao, 32-13-26/1, B.M.Rao Road, Moghalrajapuram, Vijayawada-520 010